www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 05 | మంగళవారం | 4 ఆగస్టు, 2026

## ఎగుమతి ఇంధనాలపై కొరడా

- పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్‌పై విండ్‌ఫాల్ పన్ను రేట్ల పెంపు
- ఆగస్టు 3 నుంచే అమల్లోకి..
- పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో నిర్ణయం
- దేశీయ సరఫరాపై పన్ను యథాతథం

పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్ (ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం–ఎస్ఏఈడీ)ను కేంద్ర ప్రభుత్వం పెంచింది. సవరించిన రేట్లు సోమవారం (ఆగస్టు 3) నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే దేశీయ మార్కెట్‌కు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్‌పై ప్రస్తుతం అమల్లో ఉన్న సుంకాల్లో ఎలాంటి మార్పులు చేయలేదు.




6

## ట్రంప్ టారిఫ్‌లపై తిరుగుబాటు

### కొత్త దిగుమతి సుంకాలు చట్టవిరుద్ధం

- కోర్టు మెట్లెక్కిన 25 అమెరికా రాష్ట్రాలు
- సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించారంటూ ఆరోపణ

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన కొత్త దిగుమతి సుంకాలపై అమెరికాలో రాజకీయ, న్యాయపరమైన పోరాటం మరింత ముదిరింది. కొత్త టారిఫ్‌లు చట్టవిరుద్ధమని ఆరోపిస్తూ అమెరికాలోని 25 రాష్ట్రాలు సోమవారం కోర్టును ఆశ్రయించాయి. సుప్రీంకోర్టు గతంలో కొట్టివేసిన సుంకాలనే మరో చట్టం పేరుతో మళ్లీ అమలు చేస్తున్నారని తమ పిటిషన్‌లో పేర్కొన్నాయి.



2



## సింగరేణి భవిష్యత్తుకు కీలక అడుగు

- డిప్‌సైడ్ కోల్ బ్లాక్ దక్కడం సంతోషంగా ఉంది
- ఈ బ్లాక్‌తో తెలంగాణ ఇంధన భద్రతకు మరింత బలం
- తెలంగాణ బిడ్డగా నా వంతు కృషి చేశా
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

2

మణుగూరు పీకేఓసీ–2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణి సంస్థకు కేటాయించడం తెలంగాణకు, సింగరేణి భవిష్యత్‌కు కీలక మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సంస్థ అధికారులతో పాటు తెలంగాణ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

# పర్యావరణ అనుమతులే లక్ష్యం

నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోం

## ఆరు నెలల్లో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు సాధించాలి

- సుప్రీంకోర్టు తీర్పుతో లభించిన అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి
- ప్రతి ప్రాజెక్టు పురోగతిపై పర్యవేక్షణ
- అధికారులకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించేలా కాల పరిమితితో కూడిన కార్యాచరణను అమలు చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్యంతో తీసుకుని పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రతిపాదనలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సచివాలయంలో సోమవారం సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో పర్యావరణ అనుమతుల ప్రక్రియలో న్యాయపరమైన స్పష్టత వచ్చిందని, ఇది రాష్ట్ర ప్రాజెక్టులకు అనుకూల అవకాశమని తెలిపారు. ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుని కేంద్ర పర్యావరణ శాఖతో పాటు సంబంధిత సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను లోపాలు సరిదిద్ది, చట్టపరంగా అవకాశం ఉన్నచోట మళ్లీ సమర్పించాలని సూచించారు.

### వారంలో రికార్డులు సేకరించాలి

ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, అవసరమైన రికార్డులను వారం రోజుల్లో సేకరించాలని మంత్రి ఆదేశించారు. పర్యావరణ అధ్యయనాలు, న్యాయపరమైన పత్రాలు, భూ రికార్డులు, అనుమతులకు సంబంధించిన దస్త్రాలను 30 రోజుల్లో సిద్ధం చేసి, దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణ ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. సాధ్యమైన అన్ని ప్రాజెక్టులకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిపై వారం వారీగా నివేదికలు సమర్పించాలని, ప్రతి నెల ఉన్నతస్థాయి



తరువాయి 2లో..



## మోదీ డిగ్రీ చూపిస్తే.. స్కాలర్‌షిప్ పత్రాలు చూపిస్తా

- ఈడీ, సీబీఐ విచారణకూ సిద్ధం
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే

6



## బ్రిజ్ భూషణ్‌కు భారీ ఊరట

- లైంగిక వేధింపుల కేసులో నిర్దోషిగా ప్రకటించిన ఢిల్లీ కోర్టు

6

# ఉద్యోగాల భర్తీ పేరుతో ఆటలు

## నిరుద్యోగులను మోస్తున్న రేవంత్ సర్కార్

- ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు
- యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన ఒక్క హామీ అయినా అమలు చేశారా?
- అత్యధిక క్రిమినల్ కేసులున్న రేవంత్‌రెడ్డే క్రిమినల్ వేస్ట్.. ఆయన ఏం చదివిండోతెలియదు
- నామినేషన్ పత్రమైనా సొంతంగా నింపగలరా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్ పేరుతో భారీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను ముఖ్యమంత్రి అవమానించేలా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావండి, ఇంజినీరింగ్ పట్టభద్రులను క్రిమినల్ వేస్ట్‌గా అభివర్ణించడం బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి చేసే వ్యాఖ్యలు కావని అన్నారు. అత్యధిక క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న రేవంత్‌రెడ్డే క్రిమినల్ వేస్ట్ అని విమర్శించారు. యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చిందని, వాటిలో ఒక్కదానినైనా అమలు చేశారా అని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం యువతను మోసం చేయడమేనన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను కూడా ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు.

### రాహుల్‌పైనా విమర్శలు

ఖమ్మం జిల్లాకు చెందిన వేణు ఆత్మహత్యాయత్నం ఘటనను ప్రస్తావించిన కేటీఆర్, అతడు రాసిన లేఖ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని అన్నారు. ఎన్నికల సమయంలో అశోక్‌నగర్‌లో ఉద్యోగ హామీలు ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు తెలంగాణ యువతకు ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని సమస్యలపై మౌనం వహిస్తూ, ఇతర రాష్ట్రాల్లో మాత్రం రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్హతలపై కూడా కేటీఆర్

తరువాయి 2లో..



## నడక కూడా ప్రాథమిక హక్కే

- ఆర్టికల్ 21లోని జీవించే హక్కులోనూ పాదచారుల భద్రత అంతర్భాగమే
- ప్రతి రహదారిపై పాదచారులకు ప్రత్యేక నడక మార్గం ఉండాలి
- ఆక్రమణలు లేని వాకర్స్ స్పేస్ ఏర్పాటు చేయాలి
- అవసరమైతే తాడు కట్టైనా మార్గాన్ని స్పష్టంగా గుర్తించాలి
- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

6

# ఈ ఏడాది కుంభవృష్టి

- వర్షాలు, అగ్నిప్రమాదాలతో అధిక ప్రాణనష్టం
- నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చా
- నా విగ్రహం ప్రతిష్ఠ చేస్తానని మాట ఇచ్చి నిలబెట్టుకోలేదు
- రంగం భవిష్యవాణిలో మాతంగి స్వర్ణలత



**ప్రజానావ, హైదరాబాద్:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతరలో సోమవారం నిర్వహించిన సంప్రదాయ రంగంలో మాతంగి స్వర్ణలత ఈ ఏడాది కుంభవృష్టి, అగ్నిప్రమాదాలు, ప్రాణనష్టం సంభవించే అవకాశముందని భవిష్యవాణి వినిపించారు. ప్రజలు ఏడాది పొడవునా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ప్రకృతి విపత్తులు, ప్రమాదాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాతంగి స్వర్ణలత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తాను సంతోషంగా కాకుండా క్రోధంతో వచ్చానని పేర్కొంటూ, గతంలో తన విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని అన్నారు. ప్రజలు తాను చెప్పిన సూచనలను పాటించడం లేదని, అదే తన ఆగ్రహానికి కారణమని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసే అవకాశముందని, కొన్ని ప్రాంతాల్లో వరదల కారణంగా ప్రమాదాలు సంభవించే పరిస్థితులు ఉండవచ్చని మాతంగి పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు కూడా చోటుచేసుకునే అవకాశముందని, ప్రాణనష్టం అధికంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయని చెప్పారు. అందువల్ల ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని

తరువాయి 2లో..

# నిమ్స్ అరుదైన ఘనత

- రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్ర చికిత్సలు
- వైద్య బృందాన్ని అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** నిజాం వైద్య విజ్ఞాన సంస్థ రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి అరుదైన ఘనత సాధించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రజా ప్రభుత్వ లక్ష్యానికి నిమ్స్ విజయాలు నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన రోబోటిక్ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రశంసనీయమని అన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల మైలురాయిని చేరుకున్న నిమ్స్, ఇప్పుడు వెయ్యి రోబోటిక్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా మరో రికార్డును సృష్టించిందని సీఎం కొనియాడారు. భవిష్యత్తులోనూ వైద్య సేవల్లో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు అధిగమించి దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# డిప్‌సైడ్ బ్లాక్ దక్కడం చారిత్రక విజయం

- మరింత బలోపేతం కానున్న సంస్థ భవిష్యత్
- తెలంగాణ ఇంధన భద్రతకు బలమైన భరోసా
- ప్రజా ప్రభుత్వ కృషి ఫలితమే ఈ విజయం: భట్టి



**ప్రజానావ, హైదరాబాద్:** మణుగూరు పీకేఓసీ–2 డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్ సింగరేణికి దక్కడం సంస్థ చరిత్రలో చారిత్రక విజయమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఈ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం ద్వారా సంస్థ భవిష్యత్ మరింత బలోపేతమైందన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న భట్టి విక్రమార్క స్పందిస్తూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి పరిరక్షణ, విస్తరణ, రాష్ట్ర ఇంధన భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గత 30 నెలలుగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితంగానే వరుసగా సింగరేణికి కీలక విజయాలు లభిస్తున్నాయని చెప్పారు. ఇటీవల ఒడిశాలోని నైనీ బొగ్గు గనిలో ఉత్పత్తి ప్రారంభించడం, తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించిన అనంతరం నెల రోజుల వ్యవధిలోనే మణుగూరు పీకేఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కూడా దక్కించుకోవడం విశేషమన్నారు. ఈ బ్లాక్‌లో 20 సంవత్సరాల పాటు ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున మొత్తం 120 మిలియన్ టన్నుల జీ–8 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు వెలికితీసే అవకాశం ఉందని తెలిపారు. దీని ద్వారా తెలంగాణ విద్యుత్ రంగానికి దీర్ఘకాలిక బొగ్గు సరఫరా భద్రత లభించడంతో పాటు మణుగూరు ప్రాంతంలో సుమారు రెండు వేల మంది కార్మికులకు ఉపాధి భద్రత కలుగుతుందన్నారు.

### గతంలో ప్రైవేట్ సంస్థలకు..

గత ప్రభుత్వ హయాంలో కీలక బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లాయని విమర్శించిన భట్టి, ప్రజా ప్రభుత్వం మాత్రం సింగరేణి ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంస్థను మరింత బలోపేతం చేసి, కొత్త బొగ్గు నిల్వలను సమకూర్చడంతో పాటు ఉద్యోగ భద్రతను పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మణుగూరు డిప్‌సైడ్ బ్లాక్ సాధనలో కృషి చేసిన సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాలు, ఉద్యోగులను భట్టి అభినందించారు. భవిష్యత్తులో కోయగూడెం–3, సత్తుపల్లి–3 బొగ్గు బ్లాక్‌లను కూడా సింగరేణికి దక్కేలా కృషి చేయడంతో పాటు ఇతర రాష్ట్రాల్లో బొగ్గు గనులు, క్రిటికల్ మినరల్స్ అన్వేషణలో సంస్థను విస్తరిస్తామని తెలిపారు.

# సింగరేణి భవిష్యత్‌కు కీలక అడుగు

- డిప్‌సైడ్ కోల్ బ్లాక్ దక్కడం సంతోషంగా ఉంది
- ఈ బ్లాక్‌తో తెలంగాణ ఇంధన భద్రతకు మరింత బలం
- తెలంగాణ బిడ్డగా నా వంతు కృషి చేశా
- బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



**న్యూఢిల్లీ:** మణుగూరు పీకేఓసీ–2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణి సంస్థకు కేటాయించడం తెలంగాణకు, సింగరేణి భవిష్యత్‌కు కీలక మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సంస్థ అధికారులతో పాటు తెలంగాణ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ల తర్వాత మణుగూరు పీకేఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయించాలని కార్మిక సంఘాలు కోరినట్లు తెలిపారు. కేంద్ర మంత్రిగా మాత్రమే కాకుండా తెలంగాణ బిడ్డగా, సింగరేణి అభివృద్ధిని ఆకాంక్షించే వ్యక్తిగా ఈ బ్లాక్ సంస్థకు దక్కేలా అన్ని స్థాయిల్లో ప్రత్యేక చొరవ తీసుకున్నానని పేర్కొన్నారు. మణుగూరు పీకేఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్‌లో సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. ఏటా 6 మిలియన్ టన్నుల ఉత్పత్తితో దాదాపు 25 సంవత్సరాల పాటు గని కార్యకలాపాలు కొనసాగనున్నాయని చెప్పారు. దీని ద్వారా సుమారు రెండు వేల మందికి ఉపాధి లభించడంతో పాటు రూ.43 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు పైగా ఆదాయం లభించడంతో పాటు తెలంగాణ ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

### అభివృద్ధికి ఊతం

డిప్‌సైడ్ కోల్ బ్లాక్ లభించడం వల్ల సింగరేణి సంస్థ అభివృద్ధికి అవసరమైన వనరులు మరింత విస్తరించనున్నాయని కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం, విద్యుత్ రంగం, సింగరేణి సంస్థ, ఉద్యోగులు, తెలంగాణ ప్రజలందరికీ దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరనున్నాయని ఆయన పేర్కొన్నారు.

# చలో సంసద్‌కు ముందే హెచ్చరిక

- జనసందోహ నియంత్రణపై నిర్వాహకులకు పోలీసుల స్పష్టమైన సూచనలు
- వైరల్‌గా మారిన సమావేశం వీడియో

**న్యూఢిల్లీ:** నీట్ వ్యవహారంపై కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన చలో సంసద్ నిరసన ర్యాలీకి ముందే జనసందోహ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణపై ఢిల్లీ పోలీసులు నిర్వాహకు లను హెచ్చరించినట్లు వెల్లడించే వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జులై 20న జరిగిన నిరసనకు ఒక రోజు ముందు జంతర్ మంతర్‌లో జరిగిన సమావేశానికి సంబంధించిన ఈ వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. వైరల్ వీడియోలో న్యూఢిల్లీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ సచిన్ శర్మ, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ దీపక్ పురోహిత్, సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్‌తో పాటు ఇతర నిర్వాహకులతో సమావేశమై నిరసన ఏర్పాట్లపై చర్చిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. నిరసనకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున జనసందోహాన్ని నియంత్రించేందుకు తగిన సంఖ్యలో వాలంటీర్లను నియమించాలని, పరిస్థితులు అదుపు తప్పకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని పోలీసులు సూచించినట్లు వీడియోలో స్పష్టమవుతోంది. శాంతిభద్రత లకు ఎలాంటి విఘాతం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సీజేపీ ప్రతినిధులతో ముందుగానే చర్చించినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు.

# ఉద్యోగాల భర్తీ పేరుతో ఆటలు

- నిరుద్యోగులను మోస్తున్న రేవంత్ సర్కార్
- ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు
- యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన ఒక్క హామీ అయినా అమలు చేశారా?
- అత్యధిక క్రిమినల్ కేసులున్న రేవంత్‌రెడ్డే క్రిమినల్ వేస్ట్
- సీఎం ఏం చదివారో కూడా నాకు డౌటే
- నామినేషన్ పత్రమైనా సొంతంగా నింపగలరా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్ పేరుతో భారీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను ముఖ్యమంత్రి అవమానించేలా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావండి, ఇంజినీరింగ్ పట్టభద్రులను క్రిమినల్ వేస్ట్‌గా అభివర్ణించడం బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి చేసే వ్యాఖ్యలు కావని అన్నారు. అత్యధిక క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న రేవంత్‌రెడ్డే క్రిమినల్ వేస్ట్ అని విమర్శించారు. యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చిందని, వాటిలో ఒక్కదానినైనా అమలు చేశారా అని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం యువతను మోసం చేయడమే నన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను కూడా ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు.

### రాహుల్‌పైనా విమర్శలు

ఖమ్మం జిల్లాకు చెందిన వేణు ఆత్మహత్యాయత్నం ఘటనను ప్రస్తావించిన కేటీఆర్, అతడు రాసిన లేఖ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని అన్నారు. ఎన్నికల సమయంలో అశోక్‌నగర్‌లో ఉద్యోగ హామీలు ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు తెలంగాణ యువతకు ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని సమస్యలపై మౌనం వహిస్తూ, ఇతర రాష్ట్రాల్లో మాత్రం రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్హతలపై కూడా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. సీఎం ఏం చదివారో కూడా నాకు డౌటే. ఆయన తన ఎన్నికల నామినేషన్ పత్రాన్ని సొంతంగా నింపుకోగలరా? జీవితంలో ఒక్క ఇంటర్వ్యూకైనా వెళ్లారా? అంటూ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# కావేరి జలాలపై కోర్టులోనే తేల్చుకుందాం

- సుప్రీంను ఆశ్రయించడం తమిళనాడు హక్కే
- న్యాయ బృందం సూచనల మేరకే తదుపరి చర్యలు
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో అన్ని పార్టీల మద్దతు లభించింది
- కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్



**బెంగళూరు:** కావేరి జలాల పంపిణీ వివాదంలో తమిళనాడు సుప్రీంకోర్టును ఆశ్రయించడాన్ని కర్ణాటక ప్రభుత్వం వ్యతిరేకించబోదని, ఆ రాష్ట్రానికి న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు ఉందని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. అయితే ఈ వ్యవహారంలో కర్ణాటక కూడా పూర్తిగా న్యాయపరంగానే ముందుకు సాగుతుందని, న్యాయ నిపుణుల సూచనల ఆధారంగానే సుప్రీంకోర్టులో తన వాదనలు వినిపిస్తామని వెల్లడించారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనంతరం సోమవారం మీడియాతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తమ దృష్టికి వచ్చిందన్న డీకే కోర్టును ఆశ్రయించడం ప్రతి రాష్ట్రానికీ ఉన్న రాజ్యాంగబద్ధమైన హక్కేనని, ఆ నిర్ణయంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే కర్ణాటక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని న్యాయ బృందంతో సమగ్రంగా చర్చించి, వారి సలహాల మేరకు సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపిస్తామని స్పష్టం చేశారు. కావేరి జలాల నిర్వహణ ప్రాధికార సంస్థ (సీడబ్ల్యూఎంఏ) ఆదేశాలను అనుసరించే తమిళనాడుకు నీటిని విడుదల చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జలాశయాల్లో నీటి లభ్యత పెరగడంతో, కావేరి జలాల నియంత్రణ కమిటీ (సీడబ్ల్యూఆర్‌సీ) సిఫార్సులను సమర్థించిన సీడబ్ల్యూఎంఏ ఆదేశాల మేరకు 15 రోజుల పాటు రోజుకు 3,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

### అన్ని పార్టీలతో చర్చించాం

కావేరి జలాల అంశంపై అన్ని రాజకీయ పార్టీలతో పాటు మాజీ ముఖ్యమంత్రులు, వివిధ వర్గాల నాయకులతో విస్తృతంగా చర్చించినట్లు శివకుమార్ తెలిపారు. బీజేపీ, జేడీఎస్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీలూ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఒకే అభిప్రాయంతో నిలిచి ప్రభుత్వానికి మద్దతు తెలిపాయని చెప్పారు. కావేరి విషయంలో కర్ణాటక మొత్తం ఒకే వేదికపై నిలవడం రాష్ట్రానికి బలాన్ని చేకూర్చిందని, ఇదే ఐక్యత భవిష్యత్తులోనూ కొనసాగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే విషయంలో సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులకు శివకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సమావేశానికి హాజరు కాలేకపోయినా, కేంద్ర ప్రభుత్వ దృష్టికి కర్ణాటక అభ్యర్థనను తీసుకెళ్లి సహకరించినట్లు వెల్లడించారు. కావేరి జలాల అంశంలో రాష్ట్ర హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం న్యాయపరంగా, రాజ్యాంగబద్ధంగానే పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# మోదీ వీడియో తొలగింపుపై జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి

- పార్లమెంటరీ కమిటీ సమావేశంలో మెటాపై సభ్యుల ఆగ్రహం
- 10 రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశం.. బాధ్యులపై చర్యలకూ డిమాండ్

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక ఫేస్‌బుక్ వీడియోను తాత్కాలికంగా తొలగించిన ఘటనపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలని సమాచార సాంకేతికతపై పార్లమెంటరీ స్థాయీ సంఘం చైర్మన్ నిశికాంత్ దూబే డిమాండ్ చేశారు. ఈ ఘటన కేవలం సాంకేతిక లోపం కాదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఈ అంశంపై 10 రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని కమిటీ మెటాకు ఆదేశించింది. సమావేశంలో దూబే మాట్లాడుతూ.. మోదీ వీడియోను అర్ధరాత్రి 12.30 నుంచి ఉదయం 5 గంటల వరకు ఫేస్‌బుక్ నుంచి తొలగించడం అత్యంత తీవ్రమైన విషయమన్నారు. ఇది వ్యవస్థ వైఫల్యమా? లేక ప్రధానమంత్రి ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశపూర్వక చర్యా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పకపోతే సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్–79 కింద మెటాకు ఉన్న సేఫ్ హార్బర్ రక్షణను పునఃసమీక్షించాలని కూడా సూచించారు.

### బాధ్యత నిర్ధారించాలి

ఈ ఘటనపై మెటా ప్రతినిధులు విచారం వ్యక్తం చేసి క్షమాపణ చెప్పేందుకు సిద్ధమని తెలిపినప్పటికీ, కేవలం క్షమాపణతో సరిపెట్టకుండా బాధ్యతను నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కొందరు సభ్యులు డిమాండ్ చేశారు. భారత్‌లో భారీ ఆదాయం ఆర్జిస్తున్న మెటా, దేశ చట్టాలను పూర్తిగా పాటించడం లేదని కూడా సభ్యులు అభిప్రాయపడ్డారు. అయితే సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు సోషల్ మీడియా వేదికల్లో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉండాలని, ప్రభుత్వ వ్యతిరేక కంటెంట్‌ను దేశ వ్యతిరేకంగా పరిగణించరాదని అభిప్రాయపడినట్లు సమాచారం.

### అల్గోరిథంలపై ప్రశ్నలు

మోదీ వీడియోను ఎందుకు తొలగించారనే అంశంతో పాటు, చిన్నారులు, మహిళలకు సంబంధించిన అభ్యంతరకర కంటెంట్ కొనసాగుతుండగా సాధారణ పోస్టులు ఎందుకు తొలగిస్తున్నారంటూ కమిటీ సభ్యులు మెటా ప్రతినిధులను ప్రశ్నించారు. సమావేశానికి కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఎలక్ట్రానిక్స్ & ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో పాటు మెటా, గూగుల్, ఎక్స్, యూట్యూబ్, స్నాప్‌చాట్ ప్రతినిధులు హాజరయ్యారు.

# జాగృత హిందువుగా మారాలనుకుంటున్నా

- బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను స్వీకరించాలని ఉంది సంఘిగా మారడంలో తప్పేంటి?
- గతాన్ని తవ్వి విమర్శించడం సరికాదు
- ఎంపీ కంగనా రనౌత్
- ఇన్‌స్టా వేదికగా వీడియో రిలీజ్

## జెన్ - జెడ్‌పై వ్యాఖ్యలతో మళ్లీ చర్చ

ఇటీవల జంతర్‌మంతర్‌లో జరిగిన నిరసనల్లో పాల్గొన్న జెన్–జెడ్ యువతపై కంగనా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. ఆ నిరసనల వీడియోలను అసహ్యకరమైనవిగా అభివర్ణించిన ఆమె, పాశ్చాత్య ప్రభావంతో పెరిగిన యువతను జనరేషన్ గట్టర్‌గా పేర్కొనడం సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు కారణమైంది. తాజాగా విడుదల చేసిన వీడియోలో చేసిన వ్యాఖ్యలతో మరోసారి రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చకు తెరలేపారు.

**న్యూఢిల్లీ:** తాను ఒకప్పుడు మితవాద హిందువుగా ఉండేదాన్నని, ఇప్పుడు జాగృత హిందువుగా మారాలని కోరుకుంటున్నానని సినీ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను పూర్తిగా స్వీకరించాలనే ఆకాంక్ష తనకు ఉందని వెల్లడించారు. సోమవారం ఇన్‌స్టాగ్రామ్‌లో విడుదల చేసిన వీడియోలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. నువ్వు ఎప్పటి నుంచి సంఘిగా మారావు? అంటూ కొందరు తనను ప్రశ్నిస్తున్నారని కంగనా చెప్పారు. తాను సంఘిగా మారాలని కోరుకుంటున్నానని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని అనుసరించే జాగృత హిందువుగా ఎదగడంలో తప్పేముందని ప్రశ్నించారు. వ్యక్తి తన ఆలోచనల్లో మార్పు కోరుకోవడం సహజమని వ్యాఖ్యానించారు. హిందూ మహిళల విషయంలో సమాజంలోని కొందరు వారి గతాన్ని తవ్వి విమర్శించడం సరికాదని కంగనా అన్నారు. తాను గతంలో పార్టీలకు వెళ్లానని, మరికొన్ని విషయాల్లో పాల్గొన్నానని అంగీకరిస్తూనే, ఇప్పుడు తన ఆలోచనలు మారాయని చెప్పారు. మారాలనుకునే వ్యక్తికి సమాజం అవకాశం ఇవ్వాలని సూచించారు. తన గతాన్ని సమర్థించుకునే ప్రయత్నం చేయడం లేదని స్పష్టం చేసిన కంగనా, సినీ పరిశ్రమలో సమాన వేతనాలు, బంధుప్రీతి (నెపోటిజం), మహిళల పాత్రలపై వివక్ష, ఐటమ్ సాంగ్స్ వంటి అంశాలపై తాను చాలా కాలం నుంచి పోరాడుతున్నానని గుర్తుచేశారు. సమాజంలో మార్పు కోసం అప్పటినుంచే తన వంతు ప్రయత్నం కొనసాగుతోందని తెలిపారు.

# ట్రంప్ టారిఫ్‌లపై తిరుగుబాటు

- కొత్త దిగుమతి సుంకాలు చట్టవిరుద్ధం
- కోర్టు మెట్లెక్కిన 25 అమెరికా రాష్ట్రాలు
- సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించారంటూ ఆరోపణ



**వాషింగ్టన్:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన కొత్త దిగుమతి సుంకాలపై అమెరికాలో రాజకీయ, న్యాయపరమైన పోరాటం మరింత ముదిరింది. కొత్త టారిఫ్‌లు చట్టవిరుద్ధమని ఆరోపిస్తూ అమెరికాలోని 25 రాష్ట్రాలు సోమవారం కోర్టును ఆశ్రయించాయి. సుప్రీంకోర్టు గతంలో కొట్టివేసిన సుంకాలనే మరో చట్టం పేరుతో మళ్లీ అమలు చేస్తున్నారని తమ పిటిషన్‌లో పేర్కొన్నాయి. గత నెల అమెరికా ప్రభుత్వం 59 దేశాలతో పాటు యూరోపియన్ యూనియన్‌కు చెందిన దిగుమతులపై 10 నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలను విధించింది. బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతులను అరికట్టడం, అమెరికా వాణిజ్య ప్రయోజనాలను పరిరక్షించడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది. అయితే గతంలో అత్యవసర అధికారాల చట్టం (ఐఈఈపీఏ) కింద ఇలాంటి సుంకాలు విధించే అధికారాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో, ఇప్పుడు 1974 ట్రేడ్ యాక్ట్‌లోని సెక్షన్–301ను ఆధారంగా చేసుకుని అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని రాష్ట్రాలు ఆరోపించాయి. సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలిన తర్వాత కూడా ప్రభుత్వం కొత్త చట్టాలను ఆసరాగా చేసుకుని కుటుంబాలు, వ్యాపార సంస్థలపై అదనపు పన్నుల భారాన్ని మోపేందుకు ప్రయత్నిస్తోందని న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిషియా జేమ్స్ విమర్శించారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పు స్ఫూర్తికి విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆమె ఆరోపించారు.

### వైట్‌హౌస్ సమర్థన

రాష్ట్రాల ఆరోపణలను వైట్‌హౌస్ ఖండించింది. అమెరికా వాణిజ్య ప్రయోజనాలను కాపాడడంతో పాటు బలవంతపు శ్రమతో తయారైన ఉత్పత్తుల దిగుమతులను అరికట్టేందుకు చట్టబద్ధ అధికారాల పరిధిలోనే ఈ సుంకాలు విధించినట్లు వైట్‌హౌస్ ప్రతినిధి కుష్ దేశాయ్ తెలిపారు. 1974 ట్రేడ్ యాక్ట్‌లోని సెక్షన్–301 కింద విధించిన సుంకాలు గతంలోనూ కోర్టుల్లో చెల్లుబాటు అయ్యాయని, తాజా నిర్ణయం కూడా పూర్తిగా చట్టబద్ధమేనని ఆయన స్పష్టం చేశారు.

# ఈ ఏడాది కుంభవృష్టి

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. ఎలాంటి ఆపదలు, ప్రమాదాలు వచ్చినా అమ్మవారి అనుగ్రహం భక్తులకు ఉంటుందని మాతంగి తెలిపారు. అయితే ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించే వారిని అమ్మవారు క్షమించరని, అలాంటి వారికి తగిన ఫలితం తప్పదని హెచ్చరించారు.

### బోనాల జాతరకు ముగింపు ఘట్టం

రంగం కార్యక్రమంతో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించేందుకు ఆలయ



అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

# ఉద్యోగాల భర్తీ పేరుతో ఆటలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నలు సంధించారు. సీఎం ఏం చదివారో కూడా నాకు డౌటే. ఆయన తన ఎన్నికల నామినేషన్ పత్రాన్ని సొంతంగా నింపుకోగలరా? జీవితంలో ఒక్క ఇంటర్వ్యూకైనా వెళ్లారా? అంటూ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# పర్యావరణ అనుమతులే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

సమీక్ష నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. పర్యావరణం, అటవీ, భూసేకరణ, పునరావాసం, న్యాయపరమైన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.

### గౌరవెల్లి, సీతారామపై ప్రత్యేక దృష్టి

గౌరవెల్లి ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, కాలువల్లోని అవరోధాలను తొలగించాలని ఇంజినీర్లను మంత్రి ఆదేశించారు. సీతారామ సాగర్‌కు అవసరమైన అధ్యయనాలు, టెండర్ ప్రక్రియను ముందుగానే పూర్తి చేయాలని, పాలమూరు–రంగారెడ్డి, డిండి ప్రాజెక్టుల అనుమతుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న న్యాయ వ్యవహారాల్లో అధికారులు, న్యాయ నిపుణులు సమన్వయంతో వ్యవహరించి అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చిట్టీల పేరుతో రూ.3 కోట్ల మోసం.. దంపతులు పరారీ

- పదేళ్ల పరిచయాన్ని ఆసరాగా చేసుకుని కాలనీవాసులకు టోకరా
- ఇల్లు విక్రయించి రాత్రికి రాత్రే పరార్.. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు




ప్రజానావ, పటాన్‌చెరు: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అమీన్‌పూర్‌లో చిట్టీల పేరుతో స్థానికుల నుంచి సుమారు రూ.3 కోట్లకు పైగా వసూలు చేసి ఓ దంపతులు పరారైన ఘటన కలకలం రేపింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అమీన్‌పూర్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం, బాధితుల వివరాల ప్రకారం బీఎస్‌ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న శిరీష, ఆమె భర్త సాంబశివరావు గత పదేళ్లుగా అక్కడే బట్టల దుకాణం నిర్వహిస్తూ స్థానికులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్నారు. ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని చిట్టీల వ్యాపారం ప్రారంభించి బీఎస్‌ఆర్ కాలనీతో పాటు రాఘవేంద్ర కాలనీ, సింఫనీ కాలనీ, బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ ప్రాంతాలకు చెందిన పలువురి నుంచి భారీ మొత్తంలో నగదు సేకరించారు. పిల్లల చదువులు, వివాహాలు, భవిష్యత్ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును పలువురు చిట్టీల రూపంలో వారి వద్ద పెట్టుబడిగా పెట్టినట్లు బాధితులు తెలిపారు. అయితే ఇటీవల చిట్టీలు పూర్తయిన వారికి డబ్బులు చెల్లించాల్సిన సమయంలో శిరీష వివిధ కారణాలు చెబుతూ వాయిదాలు వేస్తూ వచ్చినట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో తమ సొంత ఇంటిని కూడా రహస్యంగా విక్రయించి, భర్తతో కలిసి సుమారు రూ.3 కోట్లకు పైగా నగదుతో రాత్రికి రాత్రే ఇల్లు ఖాళీ చేసి పరారైనట్లు ఆరోపించారు. మరుసటి రోజు ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉండటంతో పాటు ఇద్దరి ఫోన్లు స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో మోసపోయామని గ్రహించిన బాధితులు అమీన్‌పూర్ పోలీసులను ఆశ్రయించారు. నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేసి తమ కష్టార్జితాన్ని తిరిగి ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అమీన్‌పూర్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.



# జమ్మికుంటలో వెలమ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజానావ, జమ్మికుంట: పట్టణంలోని వినాయక గార్డెన్స్‌లో సోమవారం వెలమ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు, యువకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఇటీవల ఎన్నికైన సర్పంచ్‌లు మడికొండ సురేందర్‌రావు, పోల్సాని వేణురావు, పోల్నేని వేణురావులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి వారిని అభినందిస్తూ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. మడికొండ సురేందర్‌రావు సమాజ అభివృద్ధి, యువతలో ఐక్యత, విద్య, ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను తరచూ నిర్వహించి పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని అభిప్రాయం వ్యక్తమైంది.

## స్థానిక యువతకు ఉపాధి కల్పించే

# అభివృద్ధి పెట్టుబడులే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ఉద్యోగమే లక్ష్యంగా యువత వచ్చే మూడు నెలలు క్రమశిక్షణతో సిద్ధం కావాలి
- పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీరు, మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుంది
- మంథనిలో విస్తృతంగా పర్యటించిన మంత్రి




ప్రజానావ, పెద్దపల్లి (మంథని): ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించే అభివృద్ధి కార్యక్రమాలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా శివకిరణ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మన ఊరు–మన కోచింగ్ సెంటర్ ఉచిత కానిస్టేబుల్, ఎస్సై కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్‌ఎల్‌బీ గార్డెన్‌లో టీ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి ఉచిత హెల్మెట్లను పంపిణీ చేశారు. మంథని క్యాంపు కార్యాలయంలో హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి పరిశ్రమల అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థ సీఎస్‌ఆర్ కార్యక్రమం ప్రాజెక్ట్ షైన్ కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అప్‌గ్రేడేషన్, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నూతన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. రత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు.

### ఉద్యోగం సాధించే వరకు అండగా ఉంటుంది

మన ఊరు–మన కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, ప్రస్తుతం మరో 7 వేలకు పైగా పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత పూర్తిగా వినియోగించుకోవాలని, రాబోయే మూడు నెలలు జీవితాన్ని మార్చే కాలంగా భావించి స్పష్టమైన లక్ష్యంతో సిద్ధం కావాలని సూచించారు. కోచింగ్ సెంటర్‌లో అత్యుత్తమ శిక్షణతో పాటు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్, వసతి, భోజన సౌకర్యాలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ కనీసం 15 గంటలు క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం వరకు తన బాధ్యత అని, ఉద్యోగం సాధించడం మాత్రం వారి సంకల్పం, కష్టపడే తత్వంపైనే ఆధారపడి ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. తాను దారి చూపగలనని, కానీ విజయాన్ని అందుకునేది వారి కృషి ద్వారానేనని అన్నారు. వచ్చే మూడు నెలలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, మంచి ఆలోచనలతో, క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధిస్తే వారి కుటుంబాల్లో ఆనందం నింపినట్లవుతుందని, అదే తనకు నిజమైన సంతృప్తి అని తెలిపారు.

### పరిశ్రమలకు ప్రభుత్వం పూర్తి సహకారం

మంథని క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీరు, రహదారులు, ఇతర మౌలిక వసతులు అన్నింటినీ ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రానికి మరిన్ని నాణ్యమైన పెట్టుబడులు రావడం, స్థానిక యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

### బొక్కలవాగు అభివృద్ధితో నీటి సంరక్షణ

హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థ తమ సీఎస్‌ఆర్ కార్యక్రమం ప్రాజెక్ట్ షైన్ కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అప్‌గ్రేడేషన్, సుందరీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొక్కలవాగు వద్ద గార్డెనింగ్, ఓపెన్ జిమ్ అప్‌గ్రేడేషన్, వాకింగ్ ట్రాక్, చిన్నారుల కోసం పార్కు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా బొక్కలవాగులో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు డీ–సిల్టింగ్ పనులు కూడా చేపడుతున్నామని చెప్పారు. బొక్కలవాగు బండ్ అభివృద్ధి పనులకు గతంలో 2011–12 లో అనుమతులు లభించాయని, ప్రస్తుతం వాటిని ఆధునికరిస్తున్నామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులను సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టాలని హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థను కోరగా, సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించి రూ.2 కోట్ల నిధులు అందించారని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నీటి సంరక్షణ మెరుగుపడటంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి పనిచేస్తే సమాజానికి మరింత మేలు చేయగలమని పేర్కొంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టిన హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థను అభినందించారు. తెలంగాణ వ్యాప్తంగా మరిన్ని పరిశ్రమలు కూడా ఇలాంటి సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. బొక్కలవాగు సుందరీకరణ, గార్డెనింగ్, డీ–సిల్టింగ్, వాకింగ్ ట్రాక్, జిమ్, చిన్నారుల పార్కు తదితర అభివృద్ధి పనులను అత్యున్నత నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని స్పష్టం చేశారు.

### ప్రభుత్వ వైద్య సేవల బలోపేతానికి చర్యలు

అనంతరం మంథని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నిర్వహించిన నూతన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని ప్రభుత్వ వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

### కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు స్థల పరిశీలన

పర్యటనలో భాగంగా రత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, సంబంధిత శాఖల అధికారులు, కంపెనీ ప్రతినిధులతో కలిసి మంత్రి పరిశీలించారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేసి స్థానిక యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

### మంథని అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి మాట్లాడుతూ మంథని పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పలు మౌలిక వసతుల పనులను ప్రభుత్వం ప్రాధాన్యతతో చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, సయేందర్ రెడ్డి, తహసిల్దార్ ఆరిఫ్ ఉద్దీన్, ప్రజా ప్రతినిధులు, హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# వరద కాలువలపై నిఘా పెంచాలి

- షేక్‌పేట నాలాను పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- రెండు మూడు రోజుల్లో పూడిక, చెత్త తొలగించాలి
- సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణకు ఆదేశం

ప్రజానావ, హైదరాబాద్: షేక్‌పేట పరిధిలోని హకీంషా విరాట్‌నగర్‌లో చెత్తతో నిండిపోయిన వరద కాలువను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలువలో పెద్దఎత్తున వ్యర్థాలు పేరుకుపోవడానికి గల కారణాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇటీవల ఈ సమస్యపై మీడియాలో వచ్చిన కథనాలు, స్థానికుల నుంచి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో కమిషనర్ నేరుగా కాలువను పరిశీలించారు. పై ప్రాంతాల నుంచి పెద్దఎత్తున చెత్త కొట్టుకురావడంతో పాటు కొందరు ఇష్టానుసారంగా కాలువలో వ్యర్థాలు వేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని హైడ్రా ఆర్‌ఎఫ్‌వో జయప్రకాశ్, ఎస్‌ఎఫ్‌వో చరణ్ కమిషనర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన ఏవీ రంగనాథ్ షేక్‌పేట ఓయూ కాలనీ, మారుతినగర్, వివేకానందనగర్, అంబేద్కర్‌నగర్, ఎంజీనగర్, హకీంషా విరాట్‌నగర్, బృందావన్ కాలనీ వరకు వరద కాలువ వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కాలువల్లో చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి వెనుకంజ వేయొద్దని స్పష్టం చేశారు. స్థానిక కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో మాట్లాడి ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు కాలువల్లో చెత్త వేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద కాలువలోకి జేసీబీలను దించి రెండు మూడు రోజుల్లో మొత్తం చెత్త, పూడికను పూర్తిగా తొలగించి వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని హైడ్రా కమిషనర్ అధికారులను ఆదేశించారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ డే లక్ష్యం

**జిల్లా ఎస్పీ మహేష్ బీ.గితే**

ప్రజానావ, సిరిసిల్ల : గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 38 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.

# సర్ విజయవంతానికి రాజకీయ పార్టీల సహకారం అవసరం

- ఎన్యూమరేషన్ ఫారాల గడువు ఆగస్టు 10 వరకు.. అర్హులైన ఓటర్లు వినియోగించుకోవాలి
- జిల్లాలో 78.50 శాతం డిజిటలైజేషన్ పూర్తి.. పురోగతిని సమీక్షించిన కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజానావ, సంగారెడ్డి: జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియాశీలకంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్ఠంగా నిర్వహించడంలో రాజకీయ పార్టీల సూచనలు, సహకారం కీలకమని ఆయన పేర్కొన్నారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సోమవారం అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్‌ఐఆర్ కార్యక్రమం పురోగతిపై చర్చించారు. జిల్లాలో జరుగుతున్న ఎస్‌ఐఆర్ ప్రక్రియ, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్, ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించిందని తెలిపారు. ఇప్పటివరకు ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు తమ బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) లేదా సంబంధిత హెల్ప్‌డెస్క్‌లో వెంటనే ఫారాలు సమర్పించాలని సూచించారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ సగటున 78.50 శాతం పూర్తయిందని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు నిరంతర పర్యవేక్షణతో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియను కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఓటరు జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలకు సంబంధించి ఆయా ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్ పురోగతిని వివరిస్తూ నారాయణఖేడ్‌లో 88 శాతం, ఆందోల్‌లో 87 శాతం, జహీరాబాద్‌లో 81 శాతం, సంగారెడ్డిలో 79 శాతం, పటాన్‌చెరులో 66 శాతం ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లాలో ఎస్‌ఐఆర్ కార్యక్రమం సజావుగా కొనసాగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ తమ పరిశీలనలో గుర్తించిన పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సూచనలు చేశారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, ఈఆర్‌వోలు, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జగిత్యాల బస్టాండ్ భూముల్లో నిర్మాణ అనుమతులపై విచారణ కోరిన మాజీ చైర్‌పర్సన్



ప్రజానావ, వేములవాడ : వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండ్ కోసం సేకరించిన భూముల్లో నిర్మాణ అనుమతులు జారీ చేయడంపై వేములవాడ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి రాజు జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. భూసేకరణ జరిగిన సర్వే నంబర్ 853లో నిబంధనలకు విరుద్ధంగా కొందరికి నిర్మాణ అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. గెజిట్‌ను ఆధారంగా చేసుకుని టౌన్ ప్లానింగ్ అధి కారులు అనుమతుల పేరుతో వసూళ్లకు పాల్పడు తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే జారీ చేసిన అనుమతులను రద్దు చేసి అందరికీ సమన్యాయం చేయాలని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

# గీతాంజలి హై స్కూల్‌లో వైభవంగా బోనాల సంబురాలు

ప్రజానావ, పెద్దపల్లి : పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న గీతాంజలి హైస్కూల్‌లో తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన మహంకాళి అమ్మవారికి కృతజ్ఞతాభావంతో పాటు ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని కోరుతూ నిర్వహించే ఈ పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ పద్ధతిలో బోనం తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. వేడుకల్లో విద్యార్థులు మహంకాళి అమ్మవారి, పోతరాజు వేషధారణలో అలరించి అందరి ప్రశంసలు పొందారు. అనంతరం పాఠశాల కరెస్పాండెంట్ రేపాల రజిత, అకాడమిక్ డైరెక్టర్ శ్రీ రేపాల రోహిత్ సతీమణి, రేపాల వర్షా, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు కలిసి డప్పు చప్పుళ్ల నడుమ పాఠశాల నుంచి స్థానిక శాంతినగర్ హనుమాన్ దేవాలయం వరకు బోనాల ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తమ అభిమానాన్ని చాటిచెప్పారు.



విద్యార్థుల్లో మన పండుగలు, సంస్కృతి, ఆచారాల పట్ల అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం వెల్లడించింది.

## రాముని చెరువు కట్టపై కబ్జాలు అరికట్టాలి

ప్రజానావ, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై జరుగుతున్న ఆక్రమణలను తక్షణమే అడ్డుకుని చెరువు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని రాముని చెరువు కట్ట వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. రాముని చెరువు కట్ట స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించి ఇండ్లు, నాలాలు నిర్మిస్తున్నారని, దీనివల్ల చెరువు పరిసరాల స్వరూపం దెబ్బతింటోందని పేర్కొన్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు వాకింగ్‌కు వచ్చే ఈ ప్రాంతంలో కనీస సౌకర్యాలు కూడా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలి పారు. వాకర్ల సౌకర్యార్థం రీడింగ్ రూమ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు చెరువు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి ఆక్రమణలను పూర్తిగా అడ్డుకోవాలని కోరారు. చుట్టుపక్కల నివాస ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు నేరుగా చెరువులోకి చేరుతుండటంతో ఆహ్లాదకర వాతావరణం కలుషితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాముని చెరువు కట్ట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మెరుగు తిరుపతి, షబ్బీర్ పాషా, రంగు రాజేశం, కైలాసం, రవూఫ్, బియ్యాల సత్తయ్య, అక్బర్ పాషా, సూర్యనారాయణ గౌడ్, ఇంతియాజ్ అలీ, సదన్న తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

- ప్రతి పాఠ్యాంశంపై పట్టు సాధించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల అర్బన్ రెసిడెన్షియల్ విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజానావ, సిరిసిల్ల : విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని అర్బన్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్ రూమ్ లో బియ్యం, పప్పులు, గుడ్లు ఇతర నిలువ పదార్థాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడాడు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం భోజనం పెడుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. సైన్స్ పాఠ్యాంశానికి సంబంధించిన పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతి సబ్జెక్టులోని అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రణాళిక ప్రకారం చదివితే భవిష్యత్తు లో ఎంతో మేలు చేస్తుందని వివరించారు. విరామ సమయంలో విద్యార్థులు ఆటలు ఆడాలని సూచించారు.




# హామీలను మోసగిస్తున్న పాలకులు!

**ఎన్ని భూములు అన్యాక్రాంతం అయ్యాయో తెలియదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోలేదు. దేవాదాయ భూములు తెలంగాణలో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు దౌర్జన్యంగా అవి పట్టాలు చేయించు కుని, రైతుభరోసా కూడా పొందుతున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవడంలో గత కేసీఆర్ ప్రభుత్వం, రేవంత్ ప్రభుత్వం డా విఫలమ య్యింది. మంత్రి కొండా సురేఖ ఉత్సవ విగ్రహంలా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఏపిలో కూడా ఇలాంటి భూములపై చంద్రబాబు ఒక్కమాటా మాట్లాడడం లేదు.**

తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తోంది. ప్రధాన సమస్యలపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ముఖ్యంగా ధరణి విషయంలో ఎన్నో చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పటికీ దీనిపై స్పష్టత లేదు. ఎన్ని భూములు అన్యాక్రాంతం అయ్యాయో తెలియదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోలేదు. దేవాదాయ భూములు తెలంగాణలో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు దౌర్జన్యంగా అవి పట్టాలు చేయించు కుని, రైతుభరోసా కూడా పొందుతున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవడంలో గత కేసీఆర్ ప్రభుత్వం, రేవంత్ ప్రభుత్వం డా విఫలమయ్యింది. మంత్రి కొండా సురేఖ ఉత్సవ విగ్రహంలా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఎపిలో కూడా ఇలాంటి భూములపై చంద్రబాబు ఒక్కమాటా మాట్లాడడం లేదు. ఇకపోతే కాళేశ్వరంపై విమర్శలు తప్ప ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునే ఆలోచన చేయడంలేదు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లపై గందరగోళం జరుగుతోంది. దీనిని సజావుగా పరిష్కరించడం లేదు. కోర్టుల్లో కేసులు కూడా దాఖలు అయ్యాయి. జర్నలిస్టులు ఇంటిస్థలాలు, ఆరోగ్య కార్డులు ఊసే లేదు. ఇప్పటి ఉమ్మడి ఏపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి టాయించిన 70 ఎకరాల భూమిని కాజేసే కుట్రలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపి, వేలకోట్ల విలువ చేసే భూమిని లాగేసుకుని, జర్నలిస్టులకు మొండిచేయి చూపేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందులో కొందరు జర్నలిస్టుల పాత్రడా ఉంది. జర్నలిస్టులకు అన్యాయం చేయడంలో టిడిపి ప్రభుత్వం, జగన్ ప్రభుత్వం కూడా ఏపీలో ఇదే తరహా పోకడలు సాగించింది. ఇక అన్నింటికన్నా పెద్ద సమస్య నిరుద్యోగ సమస్య. మొన్నటికి మొన్న ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు మద్దతు తెలిపిన రాహుల్, రేవంత్‌రెడ్డిలు తెలంగాణ నిరుద్యోగుల ఆందోళనలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఇక్కడా అలాంటి ఉద్యమం వస్తే తప్ప వీరు స్పందించేలా లేరు. క్యాలెండర్లు మారాయి కానీ కొలువులు మాత్రం రావడలేదని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండున్న రేండ్లు దాటినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఇటీవలే సిఎం రేవంత్ 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. అంటే ఆయన ఇచ్చిన హామీని ఆయనే నెరవేర్చలేదని చెబుతున్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు రెండేండ్లు పూర్తయినా.. నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. నోటిఫికేషన్లపై మాట తప్పిన సర్కార్ మీద నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. నాలుగువేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి.. ఇదీ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది. జాబ్ క్యాలెండర్ జాడ లేదు. నిరుద్యోగ భృతి ఊసులేదు. 'ఇదిగో మా నిబద్ధత..' అంటూ 2024 ఆగస్టు 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టారు. 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. ఈ క్యాలెండర్ గడువు కూడా ముగిసింది. కానీ, అందులో పేర్కొన్న ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల కాలేదు. 2025 ఆగస్టు 2,శనివారంతో 2026 ఆగస్టు 2 కూడా గడిచిపోయింది.రెండేండ్ల గడువు పూర్తయ్యింది. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు విలువ లేకుండా పోయింది. నిరుద్యోగ యువతను తమవైపు తిప్పుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. దీనిని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచింది. కానీ, డిక్లరేషన్‌లో ప్రకటించిన ఒక్క హామీని డా నెరవేర్చలేదు. ఉద్యోగాలొచ్చే వరకు యువతకు నెలకు రూ. 4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని డా కాంగ్రెస్ నేతలు మరచిపోయారు. అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్న హామీని డా నెరవేర్చలేదు. రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్న హామీని పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా దాదాపు 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. వీరితోపాటు విద్యుత్తు సంస్థలు, పలు బోర్డులు, విభాగాల్లోనూ పెద్దఎత్తున ఉద్యోగ విరమణ పొందుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో 14వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంటున్నారు. యూనివర్సిటీల్లో 2వేలకుపైగా బోధన, మరో 2,800 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గురుకులాల్లో ఆరువేలు, ఆర్టీసీలో మూడువేలకుపైగా, పోలీసు శాఖలో 17వేలకుపైగా ఖాళీలున్నాయి. ఎక్సైజ్ శాఖలో వెయ్యి, అంగన్‌వాడీల్లో 15వేలకుపైగా, మైనారిటీ సంక్షేమ శాఖలో మూడువేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలా పలు శాఖల్లో పెద్దఎత్తున ఖాళీలున్నా సర్కార్ నోటిఫికేషన్లు విడుదల చేయడంలేదన్న ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది. మరోవైపు రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండటం గమనార్హం. మూడు లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే అంతే స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. దీనికి గత కేసీఆర్ ప్రభుత్వం ప్రధాన దోషిగా ప్రకటించాలి. ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసి, అలా అనలేదని బుకాయించారు. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెట్టువూద ఆకులతో ఇస్తర్లు కుట్టినట్లు లెక్కలు చెప్పారు. ఏతావాతా ఎవరు అధికారంలోకి వచ్చినా తమ స్వప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని తేల్చారు. అలు కెసిఆర్, రేవంత్, చంద్రబాబు, జగన్ ఎవరైనా ప్రజలు మాటలతో బురిడీ కొట్టించడంలో ఆరితేరారు.

**మూడు లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే అంతే స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. దీనికి గత కేసీఆర్ ప్రభుత్వం ప్రధాన దోషిగా ప్రకటించాలి. ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసి, అలా అనలేదని బుకాయించారు. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెట్టువూద ఆకులతో ఇస్త ర్లు కుట్టినట్లు లెక్కలు చెప్పారు. ఏతావాతా ఎవరు అధికారంలోకి వచ్చినా తమ స్వప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని తేల్చారు. అలు కెసిఆర్, రేవంత్, చంద్రబాబు, జగన్ ఎవరైనా ప్రజలు మాటలతో బురిడీ కొట్టించడంలో ఆరితేరారు.**

EDITORIAL

## పరిశ్రమల అనుమతులు సకాలంలో మంజూరు చేయాలి

- పెండింగ్ దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలి
- అధికారులకు కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఏడు మంది ఎస్టీ లబ్ధిదారులకు రూ.17.50 లక్షల రాయితీకి డీఐపీసీ ఆమోదం

ప్రజానావ, యాదాద్రి భువనగిరి: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని అనుమతులను సకాలంలో మంజూరు చేసి పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో సోమవారం టీజీ ఐపాస్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించిన దరఖాస్తులు వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉండకుండా వేగంగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా హెచ్ఎండీఏ, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిశీలించి క్లియర్ చేయాలని ఆదేశించారు. అనంతరం నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ (డీఐపీసీ) సమావేశంలో ఏడు మంది ఎస్టీ లబ్ధిదారులకు రూ.17.50 లక్షల రాయితీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే నాలుగు పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాల (రా మెటీరియల్) మంజూరుకు కూడా ఆమోదం లభించినట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రవీందర్, రవాణా శాఖ అధికారి నరేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భద్రాద్రిలో వైభవంగా ముత్తంగి సేవ.. నిత్యకల్యాణం

- ముత్యాల కవచాలతో సీతారాములకు ప్రత్యేక అలంకరణ
- భక్తుల జయజయధ్వానాల నడుమ సేవలు
- రామాలయానికి రెండు కలర్ ప్రింటర్లు విరాళంగా అందజేసిన భక్తుడు వీర బ్రహ్మానంద స్వామి



ప్రజానావ, భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో సోమవారం ముత్తంగి సేవ, నిత్యకల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటలకే అర్చకులు ఆలయ ద్వారాలు తెరిచి సుప్రభాత సేవతో నిత్యకైంకర్యాలను ప్రారంభించారు. అనంతరం ఆరాధన, అర్చన, బాలభోగం నివేదన నిర్వహించి సోమవారం ప్రత్యేక సేవల్లో భాగంగా స్వామివారికి ముత్యాలతో అలంకరించిన ముత్తంగి కవచాలను ధరింపజేసి భక్తులకు దివ్య దర్శనాన్ని కల్పించారు. ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించి బేడ మండపానికి తీసుకువచ్చి పుణ్యాహవాచనం, యజ్ఞోపవీత ధారణ, ప్రవర పఠనం వంటి వైదిక కార్యక్రమాల అనంతరం నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, సీతారాముల జైజైధ్వానాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఇదిలా ఉండగా శ్రీ సీతారామచంద్రస్వామివారిపై భక్తి, కృతజ్ఞతాభావంతో రాజమండ్రికి చెందిన వీర బ్రహ్మానంద స్వామి దేవస్థానానికి రెండు కలర్ ప్రింటర్లను విరాళంగా అందజేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి దామోదరరావుకు వాటిని అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సాయిబాబా ఆలయ కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, కడాలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మే నెలలో స్వామివారి దర్శనానికి వచ్చిన సమయంలో వీర బ్రహ్మానంద స్వామి రూ.3.50 లక్షల విలువైన బంగారు బ్రాస్లెట్‌ను ఆలయ ప్రాంగణంలో పోగొట్టుకున్నారని తెలిపారు. ఆ బ్రాస్లెట్ కొత్తగూడెంకు చెందిన వెంకటేశ్వర్లు గుర్తించి, భద్రాచలానికి చెందిన గొర్ల వెంకటేశ్వరరావు సహకారంతో దేవస్థానం అధికారులకు అప్పగించారని చెప్పారు. అనంతరం అధికారులు యజమానిని గుర్తించి బంగారు బ్రాస్లెట్‌ను భద్రంగా తిరిగి అందజేశారని వివరించా రు. తనకు ఎంతో విలువైన బంగారు బ్రాస్లెట్ తిరిగి లభించడం శ్రీ సీతారామచంద్రస్వామివారి అనుగ్రహంగా భావించిన వీర బ్రహ్మానంద స్వామి, ఆ కృతజ్ఞతకు గుర్తుగా దేవస్థానానికి రెండు కలర్ ప్రింటర్లను విరాళంగా సమర్పించినట్లు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

- ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ దివాకర్ టి.ఎస్ ఆదేశం
- స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష
- తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ప్రజానావ, ఖమ్మం: ప్రజల నుంచి అందుతున్న వినతులను సత్వరమే పరిష్కరించి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతిపత్రాలను పరిశీలించిన కలెక్టర్ పెన్షన్లు, దివ్యాంగుల సంక్షేమం, భూ సమస్యలు, ఉపాధి తదితర అంశాలకు సంబంధించిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపిస్తూ బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రతి శాఖ తమ అభివృద్ధి నివేదికలను ఆగస్టు 8లోగా జిల్లా పౌరసంబంధాల అధికారికి అందజేయాలని, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల పేర్లను ప్రశంసాపత్రాల కోసం ప్రతిపాదించాలని సూచించారు. ప్రోటోకాల్‌కు అనుగుణంగా నిమిషానికో కార్యక్రమం (మినిట్ టు మినిట్) రూపొందించి వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ మాట్లాడుతూ పుట్టిన తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సుదీర్ఘకాలం ప్రభుత్వ సేవలందించి పదవీ విరమణ పొందిన అసిస్టెంట్ సీడీపీఓ జే. రత్నకుమారి, డ్రైవర్ సీహెచ్. నాగరాజులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్‌కుమార్, డీఆర్ఓ రామ్మూర్తితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన వరుణ యాగం

ప్రజానావ, గజ్వేల్: రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో నిర్వహించిన వరుణ యాగం సోమవారం వైభవంగా ముగిసింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో పది రోజుల పాటు లోకకళ్యాణార్థం మహా రుద్రాభిషేకాలు, ప్రత్యేక వైదిక క్రతువులు నిర్వహించారు. యాగం ముగింపు సందర్భంగా శ్రీ చంద్రమౌళీశ్వర స్వామివారికి జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ మహాకార్యక్రమంలో వేద పండితులు, ఆలయ అర్చకులు, గురువులు, వేద విద్యార్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ ప్రకృతి అనుగ్రహించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని సంకల్పించి వరుణ యాగం నిర్వహించినట్లు తెలిపారు. రైతులు సుభిక్షంగా పంటలు పండించుకుని ఆనందంగా జీవించాలని, సమాజ శ్రేయస్సు, లోకకళ్యాణమే లక్ష్యంగా ఈ పుణ్యకార్యాన్ని నిర్వహించినట్లు చంద్రశేఖర శర్మ సిద్ధాంతి తెలిపారు.

## పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయి

- ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్
- ఏఎస్ఐగా పదోన్నతి పొందిన సుధాకర్‌రెడ్డిని అభినందించిన ఎస్పీ

ప్రజానావ, నాగర్‌కర్నూల్: పదోన్నతి అనేది ఉద్యోగంలో ఉన్నత స్థానానికి చేరుకోవడం మాత్రమే కాదని, దానితోపాటు బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డి ఇటీవల ఏఎస్ఐగా పదోన్నతి పొందిన సందర్భంగా సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఎస్పీ ఆయనకు ఏఎస్ఐ హోదాకు సంబంధించిన స్టార్స్‌ను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి పొందిన ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను సానుభూతితో విని తక్షణ సహాయం అందించడంతో పాటు చట్టబద్ధంగా న్యాయం జరిగేలా కృషి చేయడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, నిరుపేదలు, బలహీన వర్గాలకు పోలీసులు అండగా నిలిచి వారి విశ్వాసాన్ని నిలబెట్టాలని సూచించారు. పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం వంటి విలువలను పాటిస్తూ ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నోముల వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై రామ్‌లాల్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## గంజాయి, మత్తు సిరప్ విక్రయాల ముఠా గుట్టురట్టు

- ప్రధాన నిందితుడితో పాటు ఆరుగురిపై కేసు.. ఒకరు పరారీ
- గంజాయి, 38 టాసెక్స్ సిరప్ బాటిళ్లు స్వాధీనం
- మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతాం: డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజానావ, కోదాడ: కోదాడ పట్టణంలో అక్రమంగా గంజాయి, మత్తు సిరప్ విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మద్దే రవితేజను అరెస్టు చేయడంతో పాటు ముఠా కార్యకలాపాలను వెలుగులోకి తీసుకొచ్చినట్లు కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శ్రీరంగాపురం సమీపంలోని దేగ బాబు ఫంక్షన్ హాల్ వద్ద పోలీసులు దాడులు నిర్వహించి ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో నిందితుడు ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి నుంచి గంజాయిని కొనుగోలు చేసి కోదాడలో విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు వెల్లడించారు. దర్యాప్తును విస్తరించిన పోలీసులు వైరా రోడ్డులోని 'ఏఐ మెడినోవా' మెడికల్ షాప్‌లో షేక్ సుభానీ ఎలాంటి వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా టాసెక్స్ సిరప్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రూ.279.69 విలువైన సిరప్ బాటిల్‌ను రూ.350కు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుల వద్ద నుంచి మొత్తం 38 టాసెక్స్ సిరప్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులు ఉన్నారని, వారిలో ఇద్దరిని గత వారం రిమాండ్‌కు తరలించగా, సోమవారం మరో నలుగురిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపుతున్నామని, ఒక నిందితుడు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. జిల్లా పోలీసుల ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామని, గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై నిఘాను మరింత కట్టుదిట్టం చేశామని డీఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలోనే అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరుస్తామని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

## తల్లిపాల వారోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి

- పోషక అభియాన్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- అధికారులకు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశాలు జారీ

ప్రజానావ, నాగర్‌కర్నూల్: పోషక అభియాన్‌లో భాగం గా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్స వాలను అత్యంత ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహిం చి తల్లిపాల ప్రాధాన్యం, శిశు ఆరోగ్యం, తల్లి సంక్షేమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తల్లిపాల ప్రాముఖ్యత, శిశు పోషణ, తల్లి ఆరోగ్యం, సమతుల్య ఆహారంపై ప్రజలకు శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రూపొందిం చిన ప్రత్యేక గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని, పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా శిశువుకు అవసరమైన పోషకాలు అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. శిశువు పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలు పట్టించడం అత్యంత కీలకమని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువు సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఎదుగుతాడని పేర్కొ న్నారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడటమే కాకుండా తల్లి ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు కలిగిస్తాయని చెప్పారు. ప్రతి గర్భిణి, బాలింతకు తల్లిపాల ప్రాముఖ్యతపై సమగ్ర అవగాహన కల్పించడం మహిళా, శిశు సంక్షేమ శాఖతో పాటు వైద్య ఆరోగ్య శాఖ బాధ్యత అని స్పష్టం చేశారు. తల్లిపాల వారోత్సవాల సందర్భం గా గ్రామాలు, మండలాలు, పట్టణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారం, చర్చా వేదికలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. తల్లిపాలపై ప్రజల్లో ఉన్న అపోహలను శాస్త్రీయ ఆధా రాలతో నివృత్తి చేసి, ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలే ఉత్తమ ఆహా రం అనే సందేశాన్ని విస్తృతంగా చేరవేయాలని ఆదేశించారు. ప్రతి కార్యక్రమం ఫలవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయం, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ శాఖ అధికారి పాండు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఖాళీ ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



ప్రజానావ, ఖమ్మం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ తక్షణమే భర్తీ చేసి ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని బీజేపీ, తెలంగాణలో ఏటా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు ఇచ్చి నిరుద్యోగ యువతను మోసం చేశాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయకపోవడం తో తీవ్ర మనస్తాపానికి గురైన ఖమ్మం జిల్లా న్యూలక్ష్మీపురానికి చెందిన వేణుకుమార్ ఆత్మహత్యాయ త్నానికి పాల్పడడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేణుకు మార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 2023 మే 8న సరూర్‌నగర్ స్టేడియంలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ ప్రకటించిన 'యువ డిక్లరేషన్'లో ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల అదే వేదికపై గుర్తు చేశారని తెలిపారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పదివేల ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. పోలీసు శాఖలో 20 వేల ఖాళీలు ఉండగా కేవలం 7,400 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల యువత తీవ్ర అసంతృప్తితో ఉందన్నారు. ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడు దల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ నిరుద్యోగులకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. యువత, విద్యార్థులు ఎవరూ ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యల వంటి తీవ్రమైన నిర్ణయాలకు పాల్పడకుండా చదువులపై దృష్టి సారించాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సూచించారు.

# సుప్రీంకు మరో నలుగురు న్యాయమూర్తులు

- జడ్జిల సంఖ్య 34 నుంచి 38కు పెంచే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- ప్రతిపక్ష నిరసనల మధ్య చర్చ లేకుండానే బిల్లుకు గ్రీన్‌సిగ్నల్
- పెండింగ్ కేసుల భారం తగ్గించడమే లక్ష్యమన్న కేంద్రం

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కు పెంచే బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, రామాలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ప్రతిపక్ష సభ్యులు సభలో నినాదాలతో నిరసన కొనసాగించడంతో ఎలాంటి చర్చ జరగకుండానే బిల్లును వాయిస్ ఓట్‌తో ఆమోదించారు. అనంతరం సభను రోజంతా వాయిదా వేశారు. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షం ప్రవేశపెట్టిన చట్టబద్ధ తీర్మానాన్ని కూడా సభ వాయిస్ ఓట్‌తో తిరస్కరించింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ బిల్లును సంక్షిప్తంగా ప్రవేశపెట్టిన అనంతరం సభాపీఠం చర్చకు అవకాశం కల్పించినప్పటికీ, ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య బిల్లును నేరుగా ఓటింగ్‌కు పెట్టి ఆమోదించారు. సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచడం అత్యవసరమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ ఏడాది జనవరి 1 నాటికి సుప్రీంకోర్టులో 92,101 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని బిల్లులో వెల్లడించింది. 2025లో 75,410 కొత్త కేసులు నమోదవగా, 65,615 కేసులు మాత్రమే పరిష్కారమయ్యాయని తెలిపింది. న్యాయమూర్తుల సంఖ్య పెరగడం వల్ల పెండింగ్ కేసుల పరిష్కారం వేగవంతం కావడంతో పాటు, రాజ్యాంగ సంబంధిత కీలక అంశాల విచారణ కోసం ప్రధాన న్యాయమూర్తి తరచూ రాజ్యాంగ ధర్మాసనాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

### ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత

మే నెలలో కేంద్ర మంత్రివర్గం న్యాయమూర్తుల సంఖ్య పెంపునకు ఆమోదం తెలిపిన అనంతరం ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. ఆ ఆర్డినెన్స్ ఆధారంగా ఇప్పటికే ఐదుగురు కొత్త న్యాయమూర్తులను నియమించారు. ఇప్పుడు లోక్‌సభ ఆమోదించిన బిల్లుతో ఆ ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత లభించింది. పార్లమెంట్ సమావేశాలు లేని సమయంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం జారీ చేసే ఆర్డినెన్స్‌కు, సభ సమావేశాలు ప్రారంభమైన తర్వాత ఆరు వారాల్లో పార్లమెంట్ ఆమోదం లభించాల్సి ఉంటుంది. లేదంటే అది చెల్లుబాటు కోల్పోతుంది.

# చైనా గ్లోబల్ నిఘా కలకలం

- విదేశీయుల వివరాలు, ప్రయాణాలపై కూడా నిఘా

**బీజింగ్:** చైనా ప్రపంచవ్యాప్తంగా 140 కోట్లకు పైగా మంది వ్యక్తులపై నిఘా పెట్టినట్లు అమెరికాకు చెందిన ఓ ప్రముఖ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు మార్క్ హోఫర్‌కు 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే వెబ్‌సైట్‌లో తన పాస్‌పోర్ట్, ఫోన్ నంబర్ సహా వ్యక్తిగత వివరాలు కనిపించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ డేటాబేస్‌లో భారత్, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్ తదితర దేశాల పౌరుల వివరాలు నమోదై ఉన్నట్లు వెల్లడైంది. కెమెరాలు, మొబైల్ ఫోన్ సిగ్నల్స్ ద్వారా విదేశీయుల కదలికలను పర్యవేక్షిస్తూ, వారు స్వదేశాలకు వెళ్లిన తర్వాత కూడా నిఘా కొనసాగుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

# నడక కూడా ప్రాథమిక హక్కే

- ఆర్టికల్ 21లోని జీవించే హక్కులోనూ పాదచారుల భద్రత అంతర్భాగమే
- ప్రతి రహదారిపై పాదచారులకు ప్రత్యేక నడక మార్గం ఉండాలి
- ఆక్రమణలు లేని వాకర్స్ స్పేస్ ఏర్పాటు చేయాలి
- అవసరమైతే తాడు కట్టైనా మార్గాన్ని స్పష్టంగా గుర్తించాలి
- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పాదచారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రతి రహదారిపై పాదచారులు సురక్షితంగా, నిర్భయంగా నడిచేలా ఆక్రమణలు లేని ప్రత్యేక నడక మార్గం (వాకర్స్ స్పేస్)ను గుర్తించి అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పాదచారుల కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించి, ఆ ప్రాంతాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమణలకు గురికాకుండా చూడాలని సూచించింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం ఈ మేరకు కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం. నటరాజ్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పాదచారుల కోసం కేటాయించిన నడక మార్గాన్ని వాహనాల లేన్ల నుంచి స్పష్టంగా వేరు చేయాలని, ఆ మార్గంలో ఎలాంటి ఆక్రమణలు, అడ్డంకులు లేకుండా సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ప్రత్యేక నడక మార్గాల ఏర్పాటుకు భారీ నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. అవసరమైతే తాడు, బ్యారికేడ్లు లేదా ఇతర సాధారణ పద్ధతుల ద్వారా అయినా పాదచారుల కోసం ప్రత్యేక మార్గాన్ని స్పష్టంగా గుర్తించాలని సూచించింది. ఆ మార్గాన్ని పూర్తిగా ఆక్రమణల నుంచి రక్షించి, ప్రజలు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా నడిచే పరిస్థితులను కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేసింది. ఈ అంశంపై సంబంధిత శాఖలకు తక్షణ ఆదేశాలు జారీ చేసి అమలు చర్యలు ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇందుకు రెండు వారాల గడువు విధించిన ధర్మాసనం, తదుపరి విచారణను మరో రెండు వారాలకు వాయిదా వేసింది.

### పాదాచారులకే ప్రాధాన్యమివ్వాలి

గత జూన్ 19న ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మరోసారి గుర్తుచేసింది. ప్రత్యేకంగా గుర్తించిన ఫుట్‌పాత్‌పై నడిచే హక్కు కూడా రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కేనని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(డి) కల్పించిన స్వేచ్ఛాయుత సంచార హక్కుతో పాటు ఆర్టికల్ 21లోని జీవించే హక్కులోనూ పాదచారుల భద్రత, సురక్షిత నడక హక్కు అంతర్భాగమని పేర్కొంది. గుర్తించిన పాదచారి మార్గాల్లో వాహనాల కంటే పాదచారులకే ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ధర్మాసనం మరోసారి స్పష్టం చేసింది.

## లివ్ – ఇన్ భాగస్వామికీ 498ఏ రక్షణ : సుప్రీంకోర్టు కీలక తీర్పు

భార్యపై క్రూరత్వానికి సంబంధించిన ఐపీసీ సెక్షన్ 498ఏ నిబంధనలు, సహజీవన సంబంధాల్లోని మహిళలకు కూడా వర్తిస్తాయని సుప్రీంకోర్టు సోమవారం తీర్పునిచ్చింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం, వివాహం చేసుకోవాలనే ఉద్దేశంతో ఏర్పడిన సహజీవన బంధాల్లో మహిళపై క్రూరత్వానికి పాల్పడితే పురుష భాగస్వామిపై కూడా 498ఏ కింద కేసు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. అయితే ఈ వ్యాఖ్యానం కేవలం సెక్షన్ 498ఏకే పరిమితమని, అలాంటి కేసుల్లో అరెస్టుకు ముందు ప్రాథమిక విచారణ తప్పనిసరి అని ఆదేశించింది. రాజ్యాంగంలోని సమానత్వ హక్కు దృష్ట్యా వివాహితలు, వివాహ స్వరూపం ఉన్న సహజీవన మహిళల మధ్య వివక్ష ఉండకూడదని సుప్రీంకోర్టు పేర్కొంది.

# నీట్ ఆందోళనకారులకు సుప్రీం ఊరట

### ఈ నెల 18న తదుపరి విచారణ

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణకు సంబంధించి సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. తీవ్రమైన, హేయమైన నేరాల చరిత్ర లేని విద్యార్థులపై నమోదైన కేసులను ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే గ్రేవ్, హీనస్ నేరాలకు పాల్పడిన వారిపై నమోదైన కేసులకు ఈ వెసులుబాటు వర్తించదని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనేలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, తీవ్ర నేరాల చరిత్ర లేని విద్యార్థులపై నమోదైన కేసులను కొనసాగించబోమన్న హామీకి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అయితే గ్రేవ్, హీనస్ నేరాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న 2,700 మందికి పైగా వ్యక్తులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను మాత్రం ఉపసంహరించబోమని స్పష్టం చేశారు. ఇదిలాఉంటే విద్యార్థుల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ నిరసనల సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయవాదుల పిల్లలను సైతం పోలీసులు కొట్టారని ఆరోపిస్తూ, పోలీసుల అధిక బలప్రయోగానికి సంబంధించిన సుమారు 300 వీడియోలను కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు.

### సుప్రీం తీర్పును స్వాగతించిన సీజేపీ

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) స్వాగతించింది. జులై 25న విద్యార్థులకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం, బీజేపీ–ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును నిశితంగా పర్యవేక్షిస్తామన్నారు.

# బ్రిజ్ భూషణ్‌కు కోర్టులో ఊరట

- లైంగిక వేధింపుల కేసులో నిర్దోషిగా ప్రకటించిన ఢిల్లీ కోర్టు
- మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌కూ విముక్తి



**న్యూఢిల్లీ:** మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, మాజీ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. ఢిల్లీ అదనపు ప్రధాన న్యాయ మేజిస్ట్రేట్ అశ్విని పన్వార్ సోమవారం వెలువరించిన తీర్పులో బ్రిజ్ భూషణ్‌తో పాటు డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా ప్రకటించారు. తీర్పు అనంతరం మీడియాతో మాట్లాడిన బ్రిజ్ భూషణ్, తనపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలితే ఉరివేసుకుంటానని తొలి రోజు నుంచే చెప్పానని గుర్తుచేశారు. న్యాయస్థానం తనను గౌరవప్రదంగా నిర్దోషిగా ప్రకటించిందని పేర్కొంటూ, తన తరఫున వాదించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. పూర్తి తీర్పు ప్రతిని పరిశీలించిన తర్వాతే దీనిపై మరింత విస్తృతంగా స్పందిస్తానని వెల్లడించారు. ప్రభుత్వ తరఫు న్యాయవాది మనీష్ రావత్ మాట్లాడుతూ.. కోర్టు పూర్తి తీర్పు ప్రతిని అధ్యయనం చేసిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే మేజిస్ట్రేట్ కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాలు చేసే అవకాశాన్ని కూడా పరిశీలిస్తామని వెల్లడించారు. ఈ కేసు విచారణను ఇన్–కెమెరా విధానంలో నిర్వహించడంతో మీడియాను కోర్టు హాలులోకి అనుమతించలేదు. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ఆధారంగా నమోదైన ఈ కేసులో తుది వాదనలు పూర్తికావడంతో జూలై 2న కోర్టు తీర్పును రిజర్వ్ చేసి, ఆగస్టు 3న వెలువరించింది.

### అప్పీల్‌కు వెళ్తాం: వినేశ్

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను లైంగిక వేధింపుల కేసులో నిర్దోషిగా ప్రకటించిన ఢిల్లీ కోర్టు తీర్పుపై మహిళా రెజ్లర్లు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయనున్నట్లు ప్రపంచ చాంపియన్‌షిప్ పతక విజేత వినేశ్ ఫొగాట్ తెలిపారు. ఎక్స్‌లో స్పందించిన వినేశ్, ఈ కేసులో ప్రారంభం నుంచే ప్రభుత్వం, వ్యవస్థ బ్రిజ్ భూషణ్‌కు అండగా నిలిచాయని ఆరోపించారు. అయిన ప్పటికీ న్యాయంపై తమకు విశ్వాసం ఉందని, వీలైనంత త్వరగా అప్పీల్ దాఖలు చేసి పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 2023లో ఆరుగురు మహిళా రెజ్లర్ల ఫిర్యాదుల ఆధారంగా నమోదైన ఈ కేసులో సోమవారం ఢిల్లీ కోర్టు బ్రిజ్ భూషణ్‌తో పాటు సహ నిందితుడు వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా ప్రకటించిన విషయం తెలిసిందే.

# బీజేపీ కంచుకోటలో పీకే జెండా

- మూడున్నర దశాబ్దాల కమలనాథుల ఆధిపత్యానికి ముగింపు
- బాంకీపూర్ ఉప ఎన్నికలో జనసురాజ్ వ్యవస్థాపకుడి ఘన విజయం
- బీజేపీకి 19,324 ఓట్ల తేడాతో షాక్

**పాట్నా:** బిహార్‌లోని ప్రతిష్ఠాత్మక బాంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఘన విజయం సాధించారు. దీంతో 1995 నుంచి ఆ నియోజకవర్గంలో కొనసాగుతున్న బీజేపీ ఆధిపత్యానికి తెరపడింది. తన తొలి ఎన్నికలోనే ప్రశాంత్ కిశోర్ విజయఢంకా మోగించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు లభించగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ 44,827 ఓట్లు సాధించారు. దీంతో 19,324 ఓట్ల భారీ మెజార్టీతో ప్రశాంత్ విజయం సాధించారు. ఆర్జేడీ అభ్యర్థి రేఖా గుప్తా మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఈ స్థానం గతంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ప్రాతినిధ్యం వహించారు. ఆయన రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. 1995లో నితిన్ నబిన్ తండ్రి నవీన్ చంద్ర సిన్హా గెలిచినప్పటి నుంచి ఈ నియోజకవర్గం బీజేపీకి కంచుకోటగా కొనసాగుతూ వచ్చింది. తాజా ఫలితంతో ఆ విజయపరంపరకు ముగింపు పలికింది.

### ప్రజా తీర్పు సీఎం మార్పునకు సంకేతం

ఈ విజయం ప్రధాని నరేంద్ర మోదీకి హెచ్చరిక వంటిదని ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. బిహార్‌కు కొత్త ముఖ్యమంత్రిని నియమించాలని కోరారు. ఈ విజయం బిహార్ ప్రజలదేనని, జనసురాజ్‌కు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగుతామని తెలిపారు. మరోవైపు ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి ప్రశాంత్ కిశోర్‌కు అభినందనలు తెలియజేస్తూ ప్రజల తీర్పును గౌరవిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఉప ఎన్నికల ఫలితాలపై ఆత్మపరిశీలన చేస్తాం

- బాంకీపూర్, దాతియా ఓటములపై సమీక్షిస్తాం
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్
- గుజరాత్‌లోని మంజల్‌పూర్ విజయానికి ప్రజలకు కృతజ్ఞతలు

న్యూఢిల్లీ: బిహార్‌లోని బాంకీపూర్, మధ్యప్రదేశ్‌లోని దాతియా అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలపై పార్టీ తీవ్ర ఆత్మపరిశీలన చేపడుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవంగా స్వీకరిస్తున్నామని, మరింత ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లి వారి విశ్వాసాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. బాంకీపూర్‌లో జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ విజయం సాధించగా, మధ్యప్రదేశ్‌లోని దాతియా స్థానంలోనూ బీజేపీ పరాజయం పాలైంది. అయితే గుజరాత్‌లోని వడోదర జిల్లా మంజల్‌పూర్ నియోజకవర్గాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. మంజల్‌పూర్‌లో బీజేపీ అభ్యర్థి సతీశ్ గోవింద్‌భాయ్ పటేల్‌కు విజయం అందించిన ప్రజలకు నితిన్ నబిన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు అభినందనలు తెలిపారు.



# ఇరాన్‌కు ఇదే చివరి అవకాశం

- అణు ఒప్పందాన్ని అంగీకరించాల్సిందే
- లేదంటే దాడులు మరింత తీవ్రతరం చేస్తాం
- హోర్ముజ్ జలసంధి, అణు కార్యక్రమంపైనే చర్చలు
- దౌత్య ప్రయత్నాలకు అవకాశం ఇచ్చేందుకే భారీ దాడిని ఆపాం
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో జరుగుతున్న తాజా చర్చలు తెహ్రాన్‌కు చివరి అవకాశం అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అణు ఒప్పందంపై ఇరాన్ సానుకూల నిర్ణయం తీసుకుని పరిస్థితిని చక్కదిద్దుకోవాలని, లేకపోతే అమెరికా సైనిక చర్యలు మరింత తీవ్రరూపం దాల్చుతాయని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో సోమవారం మీడియాతో మాట్లాడిన ట్రంప్, ఇరాన్ ఇక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో జరుగుతున్న చర్చల్లో తొలి ప్రాధాన్యం హోర్ముజ్ జలసంధిని పూర్తిస్థాయిలో తెరిచి అంతర్జాతీయ నౌకాయానాన్ని సాధారణ స్థితికి తీసుకురావడమేనని ట్రంప్ తెలిపారు. అనంతరం ఇరాన్ అణు కార్యక్రమంపై నియంత్రణ, భవిష్యత్తు ఒప్పందాలకు సంబంధించిన అంశాలపై చర్చలు కొనసాగుతాయని చెప్పారు. ఈ చర్చల పురోగతిపై ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముందని వెల్లడించారు. ఆదివారం ఇరాన్‌పై రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత భారీ సైనిక దాడి చేపట్టేందుకు అమెరికా సిద్ధమైందని ట్రంప్ వెల్లడించారు. అయితే ఖతర్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నాయకుల విజ్ఞప్తితో పాటు ఇరాన్ నుంచి వచ్చిన సంకేతాలను పరిగణనలోకి తీసుకుని దౌత్యానికి మరో అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఆ దాడిని తాత్కాలికంగా నిలిపివేసినట్లు చెప్పారు.

### ఇరాన్‌పై సహనం తగ్గుతోంది

ఇరాన్ ఒకవైపు చర్చలు జరుపుతూ, మరోవైపు అలాంటి చర్చలు లేవని బహిరంగంగా ప్రకటించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ట్రంప్ విమర్శించారు. అయినప్పటికీ అణ్వాయుధాల అభివృద్ధిని అడ్డుకోవడమే అమెరికా ప్రధాన లక్ష్యమని, అదే అంశంపై ఇరు దేశాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ఇదిలాఉంటే ఇరాన్‌పై ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిపై అమెరికాలోనూ రాజకీయ చర్చ కొనసాగుతోంది. తరచూ కఠిన హెచ్చరికలు చేసి చివరి క్షణంలో వెనక్కి తగ్గుతున్నారని ప్రతిపక్ష డెమొక్రాట్లు విమర్శిస్తున్నారు. మరోవైపు ఇరాన్‌తో మరింత యుద్ధాన్ని అమెరికా ప్రజల్లో మెజారిటీ వ్యతిరేకిస్తున్నట్లు తాజా సర్వేలు సూచిస్తున్న నేపథ్యంలో, ట్రంప్ దౌత్య, సైనిక వ్యూహంపై దేశీయంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఎగుమతి ఇంధనాలపై కేంద్రం కొరడా

- పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్‌పై విండ్‌ఫాల్ పన్ను రేట్ల పెంపు
- ఆగస్టు 3 నుంచే అమలు
- పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో నిర్ణయం
- దేశీయ సరఫరాపై పన్నుయథాతథం

**న్యూఢిల్లీ:** పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్ (ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం–ఎస్ఏఈడీ)ను కేంద్ర ప్రభుత్వం పెంచింది. సవరించిన రేట్లు సోమవారం (ఆగస్టు 3) నుంచే అమల్లోకి వచ్చాయి. తాజా నిర్ణయం ప్రకారం డీజిల్ ఎగుమతులపై లీటరుకు రూ.15.50 నుంచి రూ.25.50కు, ఏటీఎఫ్‌పై రూ.14.50 నుంచి రూ.22కు, పెట్రోల్‌పై రూ.2.50 నుంచి రూ.3.50కు ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని పెంచినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో తెలిపింది. అయితే దేశీయ మార్కెట్‌కు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్‌పై ప్రస్తుతం అమల్లో ఉన్న సుంకాల్లో ఎలాంటి మార్పులు చేయలేదని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయంగా ఇంధన లభ్యతను కాపాడడంతో పాటు అంతరాతీయ ధరల వ్యత్యాసాన్ని ఆసరాగా చేసుకుని ఎగుమతులు పెరగకుండా నిరోధించేందుకు కేంద్రం మార్చి నుంచి ఈ విండ్‌ఫాల్ పన్నును అమలు చేస్తూ, ప్రతి పక్షం రేట్లను సమీక్షిస్తోంది. మే 16 నుంచి పెట్రోల్ ఎగుమతులపైనా ఈ పన్ను అమలులో ఉంది.





# మోదీ డిగ్రీ చూపిస్తే.. స్కాలర్‌షిప్ పత్రాలు చూపిస్తా

- ఈడీ, సీబీఐ విచారణకూ నేను సిద్ధం
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

**ముంబై:** ప్రధాని నరేంద్ర మోదీ తన డిగ్రీని బహిరంగపరిస్తే, తాను అమెరికాలో చదువుకునేందుకు పొందిన స్కాలర్‌షిప్, విద్యా రుణానికి సంబంధించిన పత్రాలను ప్రజలకు చూపిస్తానని కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సోమవారం అన్నారు. ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సూరత్‌కు చెందిన ఓ ఆర్టీఐ కార్యకర్త, ప్రభుత్వ ఉద్యోగం నుంచి పదవీ విరమణ చేసిన తన తండ్రి ఆర్థిక పరిస్థితులపై విచారణ జరపాలని కోరిన నేపథ్యంలో దీప్కే స్పందించారు. తన అమెరికా విద్య కోసం బోస్టన్ విశ్వవిద్యాలయం నుంచి స్కాలర్‌షిప్ పొందానని, అలాగే విద్యా రుణం కూడా తీసుకున్నానని తెలిపారు. ఆ రుణాన్ని తిరిగి చెల్లించాల్సి ఉందని పేర్కొంటూ, తన చదువుకు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎవరైనా పరిశీలించవచ్చని అన్నారు. తన స్కాలర్‌షిప్ లేఖలు, విద్యా రుణ పత్రాలు, డిగ్రీని చూపించడానికి సిద్ధంగా ఉన్నానని, అదే విధంగా ప్రధానమంత్రి మోదీ కూడా తన డిగ్రీని ప్రజల ముందుంచాలని దీప్కే డిమాండ్ చేశారు. మోదీ తన డిగ్రీని బహిర్గతం చేస్తే తాను కూడా తన పత్రాలన్నింటినీ వెల్లడిస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై ఈడీ, సీబీఐలను ప్రయోగిస్తున్నారని ఆరోపించిన దీప్కే, అవసరమైతే తన ఇంటికి వచ్చి విచారణ జరిపినా అభ్యంతరం లేదన్నారు. తన డిగ్రీ పూర్తిగా ప్రామాణికమైనదేనని, అలాగే ప్రధాని డిగ్రీ కూడా ప్రామాణికంగానే ఉంటుందని ఆశిస్తున్నానని వ్యాఖ్యానించారు.

### రాజకీయ పార్టీగా మారే ఉద్దేశం లేదు

కాక్‌రోచ్ జనతా పార్టీ రాజకీయ పార్టీగా మారుతుందా అనే ప్రశ్నకు స్పందించిన దీప్కే.. ప్రస్తుతం అలాంటి ఆలోచన లేదని చెప్పారు. దీనిని ప్రజా ఉద్యమంగానే కొనసాగించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాజకీయాలపై ప్రజల్లో విశ్వాసం తగ్గుతోందని, ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీలు మారడం, దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ప్రభుత్వాలు కూల్చడం వంటి పరిణామాల నేపథ్యంలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు.

# హసీనాపై భారత్ వైఖరి చెప్పాలి

- మాజీ ప్రధాని రాజకీయ కార్యకలాపాలపై బంగ్లా అభ్యంతరం

**ఢాకా:** పదవీచ్యుత మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఉండి రాజకీయ కార్యకలాపాలు నిర్వహించడంపై బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆగస్టు 5న న్యూఢిల్లీలో ఆమె మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు వస్తున్న ప్రచారం నేపథ్యంలో ఈ అంశంపై భారత్ తన అధికారిక వైఖరిని స్పష్టం చేయాలని కోరింది. భారత భూభాగాన్ని బంగ్లాదేశ్‌కు వ్యతిరేక రాజకీయ కార్యకలాపాలకు వినియోగించడం ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. బంగ్లా ప్రధానమంత్రి విదేశాంగ సలహాదారు హుమాయూన్ కబీర్‌తో భారత హైకమిషనర్ సమావేశమై ఈ అంశంపై చర్చించారు. హసీనా లేదా ఆమె పార్టీ నేతలు భారత భూభాగాన్ని రాజకీయ కార్యకలాపాలకు వినియోగించకుండా చూడాలని బంగ్లాదేశ్ కోరగా, విషయాన్ని పరిశీలిస్తామని భారత హైకమిషనర్ హామీ ఇచ్చినట్లు ఢాకా తెలిపింది. ఆగస్టు 5కు ముందు దేశవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం వెల్లడించింది.



# సెలెక్టర్లకు ఒకటి.. వాస్తవం మరోటి!

- కలకలం రేపుతున్న బుమ్రా గాయం
- బీసీసీఐ ఫిట్‌నెస్ వ్యవస్థపై అనుమానాలు
- సీఓఈ సమాచారంపైనా సందేహాలు
- గాయాల నిర్వహణ, రీహ్యాబ్‌పై బీసీసీఐలో అత్యున్నత స్థాయి సమీక్ష
- బుమ్రా సహా పలువురు ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై ప్రశ్నలు
- స్పోర్ట్స్ సైన్స్ విభాగం పనితీరు పరిశీలన

**న్యూఢిల్లీ:** భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే టెస్టు సిరీస్‌కు దూరమవడం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) పనితీరుపై తీవ్ర చర్చకు దారితీసింది. బుమ్రా కనీసం ఒక టెస్టుకు అందుబాటులో ఉంటాడని తొలుత సెలెక్షన్ కమిటీకి సమాచారం అందించినప్పటికీ, అనంతరం గాయం ఊహించిన దానికంటే తీవ్రంగా ఉందని తేలడంతో సెలెక్టర్లు ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో సీఓఈ వైద్య, స్పోర్ట్స్ సైన్స్ విభాగం నుంచి అందుతున్న ఫిట్‌నెస్ సమాచారం విశ్వసనీయతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సోమవారం సీఓఈ క్రికెట్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్‌తో పాటు కీలక అధికారులు వర్చువల్‌గా సమావేశమై కాంట్రాక్ట్ ఆటగాళ్ల గాయాల నిర్వహణ, రీహాబిలిటేషన్, ఫిట్‌నెస్ అంచనాలపై సమీక్ష నిర్వహించారు. బీసీసీఐలో స్పోర్ట్స్ సైన్స్ విభాగానికి శాశ్వత అధిపతి లేకపోవడం, ప్రస్తుతం తాత్కాలిక బాధ్యతలు నిర్వహిస్తున్న ధనంజయ్ కౌశిక్ ఆధ్వర్యంలోని వ్యవస్థ పనితీరును కూడా సమీక్షించినట్లు సమాచారం.

### ఆందోళన కలిగిస్తున్న పునరావృత గాయాలు

హర్షిత్ రాణాను అధిక బరువుతోనే ఫిట్‌గా ప్రకటించగా మళ్లీ హ్యామ్‌స్ట్రింగ్ గాయపడడం, వాషింగ్టన్ సుందర్‌కు పదేపదే హ్యామ్‌స్ట్రింగ్ సమస్యలు తలెత్తడం, నితీష్ కుమార్ రెడ్డి బౌలింగ్ వేగం పెంచే ప్రయత్నంలో గాయపడటం వంటి ఘటనలు సీఓఈ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఆటగాళ్ల పునరావాస కాలపట్టికలు, రిటర్న్ టు ప్లే విధానాలు సక్రమంగా అమలవుతున్నాయా అనే అంశం కూడా పరిశీలనలోకి వచ్చింది. పాద గాయం నుంచి కోలుకుంటున్న సాయి సుదర్శన్ ప్రస్తుతం నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్నప్పటికీ, తొలి టెస్టుకు పూర్తిస్థాయిలో సిద్ధమవుతాడా లేదా అన్న అంశంపై సెలెక్టర్లు అప్రమత్తంగా ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. బుమ్రా తరహా పరిస్థితి మరోసారి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.

### ఫిజియో పాత్రపైనా పరిశీలన

టీమ్ ఇండియా ఫిజియో కమలేశ్ జైన్ పనితీరును కూడా బీసీసీఐ సమీక్షించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంగ్లండ్ పర్యటన అనంతరం నిర్వహించనున్న సమీక్షా సమావేశంలో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్, వీవీఎస్ లక్ష్మణ్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పాల్గొని గాయాల నిర్వహణ వ్యవస్థను సమగ్రంగా పరిశీలించనున్నారు. ప్రస్తుతం గంభీర్ శ్రీలంక పర్యటనలో ఉండటంతో ఈ సమావేశాన్ని ప్రత్యక్షంగా లేదా వర్చువల్‌గా నిర్వహించాలనే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

# లక్ష్యం ముందు నొప్పి చిన్నదే!

- రుతుస్రావం తొలి రోజే పోటీ
- తొలి లిఫ్ట్ విజయవంతం కావడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది
- దేశానికి పతకం సాధించాలన్న నాన్న కలనే నాకు స్ఫూర్తి
- ఆసియా క్రీడలే తదుపరి లక్ష్యం
- కామన్వెల్త్ రజత పతక విజేత జ్ఞానేశ్వరి యాదవ్
- తల్లిదండ్రులతో సీఎంని కలిసిన భారత వెయిట్‌లిఫ్టర్
- ఘనంగా సత్కరించిన చత్తీస్‌గఢ్ ప్రభుత్వం
- రూ.30 లక్షల బహుమతి, డీఎస్పీగా పదోన్నతి



**రాయ్‌పూర్:** లక్ష్యం ముందు నొప్పి చిన్నదే అన్న సంకల్పమే తనను కామన్వెల్త్ క్రీడల్లో రజత పతక విజేతగా నిలిపిందని చత్తీస్‌గఢ్‌కు చెందిన భారత వెయిట్ లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్ తెలిపారు. మహిళల 53 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో రజత పతకం సాధించిన ఆమె, పోటీ జరిగిన రోజే రుతుస్రావం ప్రారంభమై తీవ్ర నొప్పిని ఎదుర్కొన్నప్పటికీ లక్ష్యంపై దృష్టి నిలిపి విజయాన్ని అందుకున్నానని వెల్లడించారు. సోమవారం తల్లిదండ్రులతో కలిసి చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కలిసిన జ్ఞానేశ్వరిని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రుతుస్రావం తొలి రోజునే అంతర్జాతీయ పోటీలో పాల్గొనడం తనకు అతిపెద్ద సవాల్‌గా మారిందన్నారు. అయితే కుటుంబ సభ్యులు, కోచ్‌లు ఇచ్చిన ధైర్యంతో ప్రశాంతంగా పోటీపై దృష్టి పెట్టానని చెప్పారు. తొలి లిఫ్ట్‌ను విజయవంతంగా పూర్తి చేయగానే ఆత్మవిశ్వాసం మరింత పెరిగిందని, లక్ష్యం ముందు నొప్పి చిన్నదే అని భావించి మిగతా లిఫ్ట్‌లన్నింటినీ విజయవంతంగా పూర్తి చేశానని తెలిపారు. ఏళ్ల తరబడి చేసిన కృషి, కుటుంబం పడిన కష్టాలే తన విజయానికి పునాది అని జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి తండ్రి దీపక్ యాదవ్ ప్రతిరోజూ సైకిల్‌పై జిమ్‌కు తీసుకెళ్లేవారని, దేశానికి పతకం సాధించాలన్న ఆయన కలే తనకు నిరంతరం స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. తల్లిదండ్రులు, కోచ్‌లు, రాజ్‌నంద్‌గావ్ ప్రజల ప్రోత్సాహం లేకపోతే ఈ విజయం సాధ్యమయ్యేది కాదన్నారు.

### గౌరవం బాధ్యతను పెంచింది

జ్ఞానేశ్వరి విజయాన్ని పురస్కరించుకుని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆమెకు *రూ.30 లక్షల నగదు బహుమతితో పాటు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) హోదా నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)*గా ప్రత్యేక పదోన్నతి ప్రకటించింది. ఈ గౌరవం తనకు మరింత బాధ్యతను, ప్రేరణను ఇచ్చిందని, మరో నెల రోజుల్లో జరిగే ఆసియా క్రీడల్లో దేశానికి మరింత గొప్ప ఫలితం అందించడమే ఇప్పుడు తన లక్ష్యమని స్పష్టం చేశారు. యువ క్రీడాకారులు ఓర్పుతో, అంకితభావంతో శ్రమిస్తే విజయం తప్పకుండా దక్కుతుందని జ్ఞానేశ్వరి సూచించారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి కుమార్తె అంతర్జాతీయ స్థాయికి ఎదగడం తమ కుటుంబానికి గర్వకారణమని, భవిష్యత్తులో దేశానికి మరిన్ని పతకాలు సాధిస్తుందనే నమ్మకం ఉందని తండ్రి దీపక్ యాదవ్ తెలిపారు.



# అంచనాలకు మించి!

- గ్లాస్గోలో భారత్ అద్భుత ప్రదర్శన
- 13 స్వర్ణాలు సహా 39 పతకాలతో నాలుగో స్థానం
- బాక్సింగ్, జూడో, పారా క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులు
- 2030 అహ్మదాబాద్ కామన్వెల్త్ గేమ్స్‌కు ఆశాజనక సంకేతాలు

**గ్లాస్గో:** సాంప్రదాయంగా భారత్‌కు అధిక పతకాలు అందించే రెజ్లింగ్, షూటింగ్, బ్యాడ్మింటన్, హాకీ వంటి క్రీడలు ఈసారి కామన్వెల్త్ గేమ్స్‌లో లేకపోయినా భారత బృందం అంచనాలకు మించిన ప్రదర్శనతో ఆకట్టుకుంది. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా ముగిసిన 2026 కామన్వెల్త్ క్రీడల్లో భారత్ 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలతో మొత్తం 39 పతకాలు సాధించి పతకాల పట్టికలో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. 122 మంది సభ్యులతో బరిలోకి దిగిన భారత జట్టు బాక్సింగ్, జూడో, పారా క్రీడల్లో అద్భుత విజయాలు నమోదు చేసి దేశ ప్రతిష్ఠను నిలబెట్టింది.

### బాక్సర్ల స్వర్ణ పంచ్

ఈ గేమ్స్‌లో భారత విజయానికి బాక్సర్లు వెన్నెముకగా నిలిచారు. భారత బాక్సింగ్ జట్టు ఏకంగా ఏడు స్వర్ణాలతో పాటు మొత్తం 10 పతకాలు గెలిచి కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. మహిళా బాక్సర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించగా, పురుష బాక్సర్లు కూడా నిలకడైన ఆటతీరుతో విజయాల్లో కీలక పాత్ర పోషించారు. జూడోలో భారత్ ఎన్నడూ లేని విజయాన్ని నమోదు చేసింది. తండ్రి మరణంతో తీవ్ర విషాదాన్ని అధిగమించిన అస్మితా దే స్వర్ణ పతకం సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. హర్ష్ సింగ్ కూడా స్వర్ణం గెలవడంతో భారత జూడో కొత్త దిశగా అడుగులు వేస్తోందనే సంకేతాలు కనిపించాయి. ఇక పారా అథ్లెట్లు మరోసారి తమ స్థాయిని నిరూపించారు. పవర్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ తదితర విభాగాల్లో పతకాలు సాధిస్తూ పారాలింపిక్స్‌లో తమ విజయాలు యాదృచ్ఛికం కాదని మరోసారి చాటిచెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో భారత పారా క్రీడల బలాన్ని వారు మరోసారి రుజువు చేశారు.

### అథ్లెటిక్స్‌లో మిశ్రమ ఫలితాలు

అథ్లెటిక్స్‌లో భారత్‌కు ఆశలు, నిరాశలు రెండూ ఎదురయ్యాయి. గాయం నుంచి కోలుకొని బరిలోకి దిగిన ఒలింపిక్ చాంపియన్ నీరజ్ చోప్రా రజతంతో సరిపెట్టుకున్నాడు. మరోవైపు మోకాలి గాయం నుంచి కోలుకున్న తేజస్విన్ శంకర్ డెకాథ్లాన్‌లో పతకం సాధించడం విశేషం. గుల్వీర్ సింగ్ రెండు పతకాలు గెలిచి భారత ఏకైక డబుల్ మెడలిస్ట్‌గా నిలవగా, మురళీ శ్రీశంకర్ మరోసారి రజత పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో 10 పతకాలు సాధించిన భారత వెయిట్‌లిఫ్టింగ్ జట్టు ఈసారి ఎనిమిది పతకాలకే పరిమితమైంది. స్వర్ణ పతకం మాత్రం స్టార్ లిఫ్టర్ మీరాబాయి చాను ఖాతాలోనే చేరింది. డోపింగ్ నిషేధాల కారణంగా కోటా తగ్గడంతో పరిమిత బృందంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆశించిన స్థాయిలో స్వర్ణాలు లభించలేదు.

### ఇతర క్రీడల్లో నిరాశ

గత కామన్వెల్త్ క్రీడల్లో సంచలనం సృష్టించిన లాన్‌బౌల్స్ ఈసారి అదేస్థాయి ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయింది. సైక్లింగ్, స్విమ్మింగ్ విభాగాల్లోనూ ఆశించిన ఫలితాలు రాలేదు. అథ్లెటిక్స్‌లో కూడా మరికొన్ని పతక అవకాశాలను భారత్ చేజార్చుకుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పెరిగిన ఆశలు

సాంప్రదాయ పతకాల క్రీడలు లేకపోయినా కొత్త విభాగాల్లో భారత క్రీడాకారులు చూపిన ప్రతిభ విశేషంగా నిలిచింది. ముఖ్యంగా బాక్సింగ్, జూడో, పారా క్రీడల్లో కొత్త తరం ఆటగాళ్లు బాధ్యతలు భుజానికెత్తుకోవడం భారత క్రీడలకు శుభపరిణామంగా మారింది. 2030లో అహ్మదాబాద్‌లో జరగనున్న శతాబ్ది కామన్వెల్త్ క్రీడలకు ముందు భారత్ మరింత బలమైన పతకాల వేటకు సిద్ధమవుతోందనే సంకేతాలను గ్లాస్గో ప్రదర్శన స్పష్టంగా తెలియజేసింది.




## ఎస్‌బీఐ ఫండ్స్‌కు లాభాల జోష్

- తొలి త్రైమాసికంలో రూ.873 కోట్ల నికర లాభం
- ఆదాయం 5శాతం, నిర్వహణలోని ఆస్తులు 11శాతం వృద్ధి
- లిస్టింగ్ అనంతరం తొలి ఆర్థిక ఫలితాల వెల్లడి

**న్యూఢిల్లీ:** ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.873 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.845 కోట్లతో పోలిస్తే లాభం 3 శాతం పెరిగినట్లు కంపెనీ సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు వెల్లడించింది. తొలి త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం 5 శాతం పెరిగి రూ.1,385 కోట్లకు చేరగా, వ్యయాలు 8 శాతం పెరిగి రూ.242 కోట్లకు చేరినట్లు తెలిపింది. మ్యూచువల్ ఫండ్ సగటు నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.12.6 లక్షల కోట్లకు చేరి, ఏడాది ప్రాతిపదికన 11 శాతం వృద్ధి నమోదు చేసింది. 15.1 శాతం మార్కెట్ వాటాతో దేశంలోనే అతిపెద్ద మ్యూచువల్ ఫండ్ సంస్థగా తన అగ్రస్థానాన్ని కొనసాగించినట్లు పేర్కొంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), ఫ్రాన్స్‌కు చెందిన అముండి సంయుక్త భాగస్వామ్య సంస్థగా ఉన్న ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ గత నెలలో స్టాక్ మార్కెట్లో లిస్టైంది. లిస్టింగ్ అనంతరం ప్రకటించిన తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఇవే కావడం విశేషం.




## రూ.6 లక్షల కోట్ల మైలురాయి దాటిన ఎస్‌బీఐ పెన్షన్ ఫండ్స్

**న్యూఢిల్లీ:** జాతీయ పెన్షన్ వ్యవస్థ (ఎన్‌పీఎస్)లో ఎస్‌బీఐ పెన్షన్ ఫండ్స్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. సంస్థ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.6 లక్షల కోట్ల మార్కును అధిగమించినట్లు సోమవారం ప్రకటించింది. ప్రభుత్వ, కార్పొరేట్, రిటైల్ విభాగాలకు చెందిన 1.85 కోట్లకుపైగా చందాదారులకు ప్రస్తుతం సంస్థ సేవలు అందిస్తోంది. ఈ ఘనతతో భారత పెన్షన్ ఫండ్ పరిశ్రమలో 34 శాతం మార్కెట్ వాటాతో తమ అగ్రస్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. 2018లో రూ.1 లక్ష కోట్ల ఏయూఎంను దాటిన ఎస్‌బీఐ పెన్షన్ ఫండ్స్, గత 15ఏళ్లలో సుమారు 36 శాతం సమ్మేళిత వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) నమోదు చేస్తూ రూ.6 లక్షల కోట్ల స్థాయికి చేరుకుందని తెలిపింది.

# రూపాయి కట్టడికి ఆర్‌బీఐ జోక్యం

- ఐదు నెలల్లో 14.9 బిలియన్ డాలర్ల విక్రయం
- మారకపు విలువ స్థిరీకరణకు కీలక చర్యలు
- లోక్‌సభలో కేంద్రం వెల్లడి
- విల్‌ఫుల్ డిఫాల్టర్ల బకాయిలు రూ.2.85 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ:** రూపాయి మారకపు విలువలో అధిక ఒడిదుడుకులను నియంత్రించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు 14.9 బిలియన్ అమెరికన్ డాలర్లను నికరంగా విక్రయించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రూపాయి విలువ పూర్తిగా మార్కెట్ శక్తుల ఆధారంగానే నిర్ణయించబడుతుందని, దానికి ఎలాంటి నిర్దిష్ట లక్ష్యాన్ని ఆర్‌బీఐ నిర్ణయించదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో తెలిపారు. అయితే విదేశీ మారకద్రవ్య మార్కెట్లో అసాధారణ హెచ్చుతగ్గులు చోటుచేసుకున్నప్పుడు పరిస్థితిని సమతుల్యం చేసేందుకు ఆర్‌బీఐ అవసరమైన మేర జోక్యం చేసుకుంటుందని స్పష్టం చేశారు.




### ఫారెక్స్, విదేశీ ప్రవాహాలపై వివరణ

విదేశీ మారకద్రవ్య నిల్వల్లో మార్పులు విదేశీ కరెన్సీ కొనుగోలు, విక్రయాలు, ఆస్తుల పునర్మూల్యాంకనం, విదేశీ సహాయం వంటి పలు అంశాలపై ఆధారపడి ఉంటాయని మంత్రి తెలిపారు. విదేశీ మారకద్రవ్య ప్రవాహాలను పెంచేందుకు ఎఫ్‌సీఎన్‌ఆర్ (బీ) డిపాజిట్లు, బాహ్య వాణిజ్య రుణాలు (ఈసీబీ), విదేశీ కరెన్సీ రుణాలపై రాయితీ స్వాప్ సౌకర్యం వంటి చర్యలను ఆర్‌బీఐ అమలు చేస్తున్నట్లు వివరించారు.

### డిఫాల్టర్లు, గోల్డ్ లోన్లపై గణాంకాలు

2026 జూన్ 30 నాటికి రూ.25 లక్షలకు పైగా బకాయిలు ఉన్న 15,930 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై రూ.2,85,015 కోట్ల బకాయిలు ఉన్నాయని, వీరిలో 7,190 కేసుల్లో రూ.1,92,187 కోట్ల డిఫాల్ట్‌లపై క్రిమినల్ చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. అలాగే స్వామిహ్ నిధి ద్వారా 147 గృహ నిర్మాణ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించగా, 67,626 గృహాలను లబ్ధిదారులకు అప్పగించినట్లు తెలిపారు. గోల్డ్ లోన్ల ఎన్‌పీఏలు తగ్గుముఖం పట్టాయని, దేశంలో 7.28 కోట్ల కిసాన్ క్రెడిట్ కార్డు ఖాతాల్లో రూ.10.08 లక్షల కోట్ల బకాయిలు ఉన్నట్లు మంత్రి వెల్లడించారు.




## రియల్ ఎస్టేట్ విస్తరణ కొనసాగిస్తాం

- స్థూల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముందుకెళ్తాం
- గత ఆర్థిక సంవత్సరంలో రూ.20,143 కోట్ల అమ్మకాల బుకింగ్స్
- డీఎల్ఎఫ్ చైర్మన్ రాజీవ్ సింగ్

**న్యూఢిల్లీ:** గృహ, వాణిజ్య రియల్ ఎస్టేట్ రంగాల్లో విస్తరణను కొనసాగిస్తూనే, స్థూల ఆర్థిక పరిస్థితులను నిశితంగా గమనిస్తూ వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్తామని డీఎల్ఎఫ్ చైర్మన్ రాజీవ్ సింగ్ తెలిపారు. 61వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వ దృష్టి రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త అవకాశాలను సృష్టిస్తోందని, వాటిని వినియోగించుకునే స్థితిలో డీఎల్ఎఫ్ ఉందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.20,143 కోట్ల కొత్త అమ్మకాల బుకింగ్స్, రూ.4,408 కోట్ల నికర లాభం నమోదు చేసిందని తెలిపారు. 1946లో స్థాపితమైన డీఎల్ఎఫ్ ఇప్పటివరకు 185కు పైగా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు.

### తొలి త్రైమాసికంలో రూ.794 కోట్ల నికర లాభం

డీఎల్ఎఫ్ 2026–27 తొలి త్రైమాసికంలో ఏకీకృత నికర లాభాన్ని 4 శాతం పెంచుకుని రూ.793.90 కోట్లకు చేర్చుకుంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.762.67 కోట్లు. అయితే మొత్తం ఆదాయం రూ.2,980.88 కోట్ల నుంచి రూ.1,605.56 కోట్లకు పడిపోయింది. ఏప్రిల్–జూన్ కాలంలో కంపెనీ ప్రీ–సేల్స్ రూ.11,425 కోట్ల నుంచి రూ.657 కోట్లకు తగ్గాయి. గృహ ప్రాజెక్టుల ప్రారంభం వాయిదా పడటమే దీనికి కారణమని సంస్థ తెలిపింది. జూన్ చివరినాటికి కంపెనీ నికర నగదు నిల్వలు రూ.15,200 కోట్లకు చేరగా, వాణిజ్య ఆస్తుల్లో 95 శాతం ఆక్యుపెన్సీ కొనసాగింది.

## జీ ఎంటర్‌టైన్‌మెంట్‌కు షాక్

- 15శాతం పతనమైన జీల్ షేర్లు
- హైదరాబాద్ భూమి తాకట్టు వ్యవహారంలో సెబీ కొరడా
- ఒక్కరోజే రూ.1,661 కోట్ల మార్కెట్ విలువ ఆవిరి

**న్యూఢిల్లీ:** హైదరాబాద్‌లోని జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జీల్)కు చెందిన భూమిని ప్రమోటర్ గ్రూప్ సంస్థల రుణాలకు అనుమతి లేకుండా తాకట్టు పెట్టిన వ్యవహారంలో సెబీ కఠిన చర్యలు తీసుకోవడంతో సోమవారం కంపెనీ షేర్లు దాదాపు 15 శాతం పతనమయ్యాయి. బీఎస్ఈలో షేరు 14.98 శాతం క్షీణించి రూ.98.15 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈలో 14.32 శాతం తగ్గి రూ.98.14కు చేరింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ ఒక్కరోజులోనే రూ.1,661.69 కోట్లు కరిగిపోయి, మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9,427.50 కోట్లకు తగ్గింది. ఈ కేసులో జీ ఎంటర్‌టైన్‌మెంట్‌పై రెండు నెలల పాటు, చైర్మన్ ఎమెరిటస్ సుభాష్ చంద్ర, ఎండీ–సీఈఓ పునీత్ గోయెంకాలపై ఒక్కో ఏడాది పాటు సెక్యూరిటీస్ మార్కెట్‌లో ప్రవేశాన్ని సెబీ నిషేధించింది. అలాగే జీల్‌కు రూ.30 లక్షలు, సుభాష్ చంద్రకు రూ.60 లక్షలు, పునీత్ గోయెంకాకు రూ.58 లక్షలు కలిపి మొత్తం రూ.1.48 కోట్ల జరిమానా విధించింది. 2018లో జీల్‌కు చెందిన హైదరాబాద్ భూమి అసలు పత్రాలను ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్‌కు అప్పగించి, ఎస్సెల్ గ్రూప్ సంస్థల రుణాలకు భద్రతగా వినియోగించినట్లు సెబీ గుర్తించింది. సంబంధిత పార్టీ లావాదేవీకి ఆడిట్ కమిటీ అనుమతి తీసుకోకపోవడం, ఆర్థిక నివేదికల్లో వివరాలు వెల్లడించకపోవడం ద్వారా లిస్టింగ్ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేల్చింది. సుభాష్ చంద్ర తన పదవిని దుర్వినియోగం చేసి కంపెనీ కీలక ఆస్తిని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రమాదంలోకి నెట్టారని సెబీ వ్యాఖ్యానించింది. సెబీ ఉత్తర్వుపై చట్టపరమైన మార్గాలను పరిశీలిస్తున్నట్లు జీ ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపింది. అయితే రూ.2,300 కోట్ల నిధుల సమీకరణ ప్రక్రియపై ఈ ఉత్తర్వు ప్రభావం ఉండదని స్పష్టం చేసింది.

> ఢిల్లీలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం వేగంగా పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఢిల్లీ ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ–2026 ప్రభావంతో జూలై నెలలో 10,719 ఎలక్ట్రిక్ వాహనాలు నమోదై ఈ ఏడాదిలోనే అత్యధిక నెలవారీ రిజిస్ట్రేషన్ నమోదైంది. ప్రభుత్వ వాహన్ పోర్టల్ గణాంకాల ప్రకారం, జూన్‌లో నమోదైన 9,296 ఈవీలతో పోలిస్తే జులైలో మరో 1,423 వాహనాలు పెరిగాయి. గతేడాది జులైలో నమోదైన 6,414 ఈవీలతో పోలిస్తే ఈసారి గణనీయమైన వృద్ధి నమోదైంది.

## దూసుకెళ్లిన దలాల్ స్ట్రీట్!

- సెన్సెక్స్ 544 పాయింట్లు, నిఫ్టీ 391 పాయింట్లు జంప్

**ముంబై:** ముడిచమురు ధరలు భారీగా తగ్గడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు సడలుతున్న సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం కలిసి దేశీయ స్టాక్ మార్కెట్లకు బలమైన ఊతమిచ్చాయి. దీంతో సోమవారం వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 544.39 పాయింట్లు (0.70 శాతం) ఎగిసి 78,639.03 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 390.70 పాయింట్లు (1.60 శాతం) పెరిగి 24,774.30 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ మధ్యలో సెన్సెక్స్ ఒక దశలో 800 పాయింట్లకు పైగా లాభపడింది. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 1,873 పాయింట్లు, నిఫ్టీ 789 పాయింట్లు ఎగబాకి బలమైన ర్యాలీ నమోదు చేశాయి. ఐటీ రంగం ఈ ర్యాలీకి నాయకత్వం వహించింది. ఇన్ఫోసిస్, టీసీఎస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్ షేర్లు లాభపడగా, సన్ ఫార్మా, భారతి ఎయిర్‌టెల్, మారుతి, టాటా స్టీల్ నష్టాల్లో ముగిశాయి. రంగాల వారీగా ఐటీ సూచీ 2.53 శాతం ఎగబాకగా, సేవలు, ఇండస్ట్రియల్స్, మెటల్స్, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంకింగ్ సూచీలు కూడా లాభాల్లో నిలిచాయి. ఆస్పత్రులు, ఆయిల్ అండ్ గ్యాస్, హెల్త్‌కేర్ రంగాలు మాత్రం బలహీనంగా ముగిశాయి. అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు పునఃప్రారంభమవుతాయన్న అంచనాలతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 4.62 శాతం తగ్గి 83.88 డాలర్లకు చేరడం మార్కెట్ సెంటిమెంట్‌కు ప్రధాన బలంగా నిలిచింది. జూలైలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) మళ్లీ కొనుగోళ్లకు మొగ్గుచూపడం కూడా మార్కెట్ల ర్యాలీకి అదనపు మద్దతునిచ్చింది.





## మంచి ప్రేమకథతో శార్వరీ-ఆయుష్మాన్ జోడీ

యాక్షన్ పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకున్న బాలీవుడ్ కథానాయిక శార్వరీ వాఘ్ ఇప్పుడు పూర్తి భిన్నమైన ప్రేమకథతో సినీప్రియుల ముందుకు రానుంది. ఇటీవల విడుదలైన 'ఆల్ఫా' చిత్రంలో తనలోని యాక్షన్ కోణాన్ని ఆవిష్కరించిన ఆమె, ఇప్పుడు రొమాంటిక్ పాత్రలో మెప్పించేందుకు సిద్ధమవుతోంది. శార్వరీ వాఘ్, హీరో ఆయుష్మాన్ ఖురానా జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'యే ప్రేమ్ మోల్ లియా'. కుటుంబ కథా చిత్రాలకు పెట్టింది పేరైన దర్శకుడు సూరజ్ బర్జాత్యా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ రాజశ్రీ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిన సందర్భంగా హీరో ఆయుష్మాన్ ఖురానా సామాజిక మాధ్యమాల వేదికగా చిత్రబృందంతో కలిసి దిగిన కొన్ని ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగంగా స్పందిస్తూ, ''ఈ ప్రయాణాన్ని ఎంతో ప్రత్యేకంగా మార్చిన దర్శకుడు సూరజ్ బర్జాత్యాతో పాటు మొత్తం చిత్రబృందానికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ అందమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం'' అని పేర్కొన్నారు. ప్రేమ, కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు పెద్దపీట వేసే కథాంశంతో ఈ సినిమా రూపొందుతున్నట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. సూరజ్ బర్జాత్యా శైలిలో ఉండే హృద్యమైన భావోద్వేగాలు, సంగీతం, కుటుంబ విలువలు ఈ చిత్రంలోనూ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. ఇప్పటికే షూటింగ్ పూర్తవడంతో ప్రస్తుతం నిర్మాణానంతర పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. శార్వరీ–ఆయుష్మాన్ ఖురానా జంట తొలిసారి తెరపై కనిపించనుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.

## ఆసక్తిగా కొరియన్ కనకరాజు ట్రైలర్



వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితిక నాయక్ కథానాయిక. ఇప్పటి చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం మూవీ ట్రైలర్‌ను విడుదల చేసింది. థ్రిల్, హాస్యం, హారర్ అంశాలను మేళవించి మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. సత్య కీలక పాత్ర పోషిస్తున్న ఈమూవీకి తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. కొరియన్ కనకరాజు పై రోజురోజు అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటి విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిథికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటి విడుదలైన రెండు పాటలు మంచి ఆదరణ పొందగా, ట్రైలర్‌లో ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా యాక్షన్, హారర్ సన్నివేశాల్లో థమన్ సంగీతం సినిమాకు అదనపు బలంగా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, సెట్స్, సాంతిక నాణ్యత సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలియజేస్తున్నాయి.ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పటి మంచి పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌లతో డిన పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

## జూలో రెండు జంతువులను దత్తత తీసుకున్న అన్నా కొణిదెల



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా) మరోసారి తన సేవా దృక్పథంతో ప్రశంసలు అందుకుంటున్నారు. గత కొంతకాలంగా సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్న ఆమె.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తనకున్న గౌరవాన్ని తరచూ పంచుకుంటూ అభిమానులకు మరింత చేరువవుతున్నారు.రష్యాలో జన్మించినప్పటికీ భారతీయ ఆచారాలను పాటిస్తూ పూజలు, పండుగలు, కుటుంబ వేడుకల్లో సంప్రదాయ దుస్తులతో కనిపించే అన్నా కొణిదెలకు ఇప్పటి సోషల్ మీడియాలో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు ఆమె తీసుకున్న మరో నిర్ణయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. తాజాగా అన్నా కొణిదెల హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని రెండు జంతువులను దత్తత తీసుకున్నారు. అందులో ఒకటి ఆసియా ఏనుగు, మరొకటి రాయల్ బెంగాల్ టైగర్. ఈ జంతువుల ఆహారం, వైద్య సంరక్షణతో పాటు ఇతర నిర్వహణ ఖర్చులను ఇకపై ఆమె భరిస్తారని సమాచారం. జూ పార్క్‌లో ఆయా జంతువుల వద్ద అన్నా కొణిదెల దత్తత తీసుకున్నట్లు ప్రత్యేక బోర్డులు డా ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రావ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇంతకుముందు పవన్ కళ్యాణ్ డా విశాఖపట్నం జూలో జిరాఫీలను దత్తత తీసుకుని జంతు సంరక్షణకు తన వంతు సహకారం అందించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో అన్నా కొణిదెల డా ముందుకు రావడం అభిమానులను ఆకట్టుకుంటోంది.

## భావోద్వేగాలతో ఆకట్టుకోనున్న రవితేజ ఇరుముడి

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఇరుముడి చిత్రంపై ఆసక్తి పెరుగుతోంది. ఈ చిత్రంలో రవితేజ తన కెరీర్‌లో ఇప్పటివరకు చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. రెగ్యులర్ మాస్ హీరో ఇమేజ్‌కు భిన్నంగా, భావోద్వేగాలకు పెద్దపీట వేసిన పాత్రలో ఆయన నటిస్తున్నారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా తండ్రి–కుమార్తె అనుబంధం చుట్టూ సాగే సన్నివేశాలు ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేసేలా ఉంటాయని తెలుస్తోంది. ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కుమార్తె పాత్రలో కనిపించనుంది. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 21న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 8న గ్రాండ్‌గా టాక్సిక్



కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్–అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. గీతూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటి సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్ ను వచ్చే ఆగస్టు 8 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీఎన్ ప్రొడక్షన్స్ (మరియు మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక జీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.

## ఐమాక్స్‌లో వారణాసి



రాజమౌళి–మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' ప్రారంభమైనప్పటి నుంచే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచంలోని పలు దేశాలు, విభిన్న ప్రాంతాల నేపథ్యంలో సాగే ఈ సాహస గాథను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నట్లు ఇప్పటికే వెల్లడైనా, ఆ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాన్ని మాత్రం దర్శకుడు రాజమౌళి ఇప్పటివరకు వెల్లడించలేదు. తాజాగా ఫ్రెంచ్ పత్రిక 'త్సోనామి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన దీనిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా కథ, విజువల్స్ సాధారణ స్థాయిలో ఉండవని, ప్రేక్షకులకు పూర్తిగా కొత్త అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే ఐమాక్స్ ఫార్మాట్‌ను ఎంచుకున్నామని రాజమౌళి తెలిపారు. పెద్ద తెరపై ప్రతి ఫ్రేమ్‌ను అత్యంత విస్తృతంగా, సహజంగా చూపించే సామర్థ్యం ఐమాక్స్‌కు ఉందని, ప్రేక్షకులు కథలో పూర్తిగా లీనమయ్యేలా చేసే సినిమాటిక్ అనుభూతిని ఈ ఫార్మాట్ అందిస్తుందని చెప్పారు. ముఖ్యంగా ఈ సినిమాలో రామాయణంలోని భారీ వానర సేనలతో కూడిన యుద్ధ దృశ్యాలతో పాటు, దాదాపు 300 అడుగుల (సుమారు 91 మీటర్లు) ఎత్తులో నిటారుగా నిలిచే అంటార్కిటికా మంచు నిర్మాణాలు కీలకంగా కనిపిస్తాయని రాజమౌళి వెల్లడించారు. అలాంటి అద్భుతమైన విజువల్స్, వాటి అసలు భారీతనాన్ని ప్రేక్షకులకు అనుభూతి కలిగించాలంటే ఐమాక్స్ యాస్పెక్ట్ రేషియో మాత్రమే సరిపోతుందని, అందుకే ఆ ఫార్మాట్‌ను ఎంచుకున్నామని వివరించారు. ప్రస్తుతం చిత్రీకరణ వేగంగా కొనసాగుతున్న ఈ భారీ ప్రాజెక్ట్‌ను కె.ఎల్. నారాయణ, ఎస్.ఎస్. కార్తికేయ నిర్మిస్తున్నారు. సంగీతాన్ని ఎం.ఎం. కీరవాణి అందిస్తుండగా, కథను విజయేంద్ర ప్రసాద్ రూపొందించారు. సంభాషణలను దేవా కట్టా రాస్తున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలకు ముందే ఈ సినిమా అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారుతోంది.

## మహేశ్ బాబు పుట్టిన రోజు కోసం ఫ్యాన్స్ ఎదురుచూపు

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నెల ఆగస్టు వచ్చేసింది. ప్రతి ఏడాది ఆగస్టు 9న మహేష్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో భారీ స్థాయిలో సందడి నెలకొంటుంది. ఈసారి డా అభిమానులు ఎస్ఎస్ఎంబీ మంత్ పేరుతో సెలబ్రేషన్స్ ప్రారంభించగా, అందరి దృష్టి ఇప్పుడు ఒ విషయంపై ఉంది.. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా నుంచి ఏదైనా ప్రత్యేక అప్‌డేట్ వస్తుందా అని చూస్తున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. అడ్వెంచర్ నేపథ్యంలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో డా ఆసక్తి నెలకొంది. మహేష్ బాబు డా ఈ సినిమా కోసం పూర్తిగా కొత్త లుక్, ప్రత్యేకమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో కనిపించనున్నట్లు సమాచారం. చిత్ర బృందం ఇప్పటి సినిమా షూటింగ్‌లో కీలక భాగాన్ని పూర్తి చేసినట్లు సమాచారం. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలకు సంబంధించిన పోస్టర్, టీజర్ లేదా గ్లింప్స్ విడుదల చేయడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది డా 'వారణాసి' నుంచి ప్రత్యేక అప్‌డేట్ ఉంటుందనే ఆశతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.



## నేనూ నీట్ పేపర్ లీక్ బాధితురాలినే..

ఇటీవల దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్ స్పందించారు. తాను కూడా ఒకప్పుడు నీట్ పేపర్ లీక్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న బాధితురాలినేనని ఆమె వెల్లడించారు. 2015లో నీట్ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడంతో పరీక్షను మళ్లీ నిర్వహించాల్సి వచ్చిందని, ఆ సమయంలో తాను తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొన్నానని తెలిపారు. డాక్టర్ కావాలన్న లక్ష్యంతో ఎంతో కష్టపడి సిద్ధమైన తనకు ఆ ఘటన పెద్ద ఎదురుదెబ్బగా మారిందని చెప్పారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న మానుషి తన అనుభవాలను గుర్తు చేసుకుంటూ, ''నీట్ ప్రవేశ పరీక్ష కోసం నెలల తరబడి ఎంతో కష్టపడి చదివాను. పరీక్ష పూర్తయిన తర్వాత ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు తెలిసి తీవ్ర నిరాశకు గురయ్యాను. పరీక్షను మళ్లీ నిర్వహించనున్నట్లు ప్రకటించడంతో మరో 45 రోజుల పాటు తిరిగి సిద్ధం కావాల్సి వచ్చింది. అప్పటికే శారీరకంగా, మానసికంగా అలసిపోయినా లక్ష్యాన్ని వదులుకోకుండా మళ్లీ చదివాను. ఆ సమయంలో ఎదురైన ఒత్తిడిని మాటల్లో చెప్పలేను'' అని పేర్కొన్నారు. తన తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఆ క్లిష్ట పరిస్థితిని అధిగమించేందుకు ఎంతో తోడ్పడిందని మానుషి చెప్పారు. ''ఆ సమయంలో అమ్మానాన్న నాకు అండగా నిలిచి ధైర్యం చెప్పారు. వారి మద్దతుతో మళ్లీ పరీక్ష రాసి అర్హత సాధించగలిగాను. అయితే ప్రతి విద్యార్థికీ అలాంటి కుటుంబ సహకారం లభించదు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి హాస్టళ్లలో ఉంటూ చదువుకున్న నా తోటి విద్యార్థులు పరీక్ష వాయిదా, పునఃపరీక్ష కారణంగా ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారి పరిస్థితిని చూసి చాలా బాధేసింది'' అని ఆమె వెల్లడించారు. హరియాణాకు చెందిన మానుషి చిల్లర్ తల్లిదండ్రులు మిత్రా బసు, నిలీమా చిల్లర్ ఇద్దరూ వైద్యులే. వైద్య విద్యపై ఆసక్తితో నీట్‌కు సిద్ధమైన ఆమె, అనంతరం మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టి 2017లో మిస్ వరల్డ్ కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో కథానాయికగా వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.